Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహవంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యూలేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు • మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 286 | హైదరాబాద్ | శనివారం 29 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

## సెప్టెంబర్ 2నుంచి వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు



- ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ఎండగట్టాలి
- అమలైన హామీలు, బాకీ ఎన్ని? వివరించండి
- బాకీ కార్డులతో ఇంటింటి ప్రచారం చేయాలి
- పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు
- టెలీకాన్ఫరెన్స్ ద్వారా నేతలకు దిశానిర్దేశం

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల అసమర్థ పాలన, హామీల అమలులో వైఫల్యం, అవినీతి ఆరోపణలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పోరుబాట పట్టనుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.

**హైదరాబాద్, ఆగస్టు 28 (ప్రజాతీర్పు)**

సెప్టెంబర్ 2నుంచి వరుసగా వారం రోజుల పాటు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ,మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కేటీఆర్ శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం రోజులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, వాటి నిర్వహణ తీరుపై నేతలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి న వంద రోజుల్లోనే హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. వెయ్యి రోజు లు దాటినా పూర్తిస్థాయిలో నెరవేర్చడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వైఖరిని ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల్లో ఎండగట్టాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పై ఉందన్నారు. పార్టీ నిర్ణయించిన కార్యాచరణను కేవలం నిరసన కార్యక్రమాలకే పరిమితం చేయకుండా.. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమిటి? వాటి లో ఎన్ని అమలయ్యాయి? ఇంకా ఎన్ని హామీలు బాకీ ఉన్నాయి? ప్రతి ఇంటికీ చేరేలా ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి నాయకుడు తన కార్యక్షేత్రంలో బాధ్యత తీసుకొని ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగ ట్టాలని కోరారు. హైదరాబాద్‌తో పాటు అర్బన్ ప్రాంతా ల్లో ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న 22 ఏ నిషేధిత జాబితా భూముల సమస్యపై ప్రత్యేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ సూచించారు. బాధితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు నిర్వహించాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 4న మహిళలు, వికలాంగులు తదితర వర్గాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కేటీఆర్ సూచించారు. మహిళలకు

- మిగతా 2వ పేజీలో

# ఆగని మృత్యుఘోష

## నేపాల్‌లో 579కి చేరిన మరణాల సంఖ్య

- కొనసాగుతున్న గాలింపు, సహాయక చర్యలు
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎటుచూసినా శిథిలాల దిబ్బలే
- 4,451 మందిని రక్షించిన అధికారులు.. 1,924 మంది గల్లంతు
- నేపాల్ నుంచి ఢిల్లీకి చేరుకున్న 21 మంది తమిళనాడు వాసులు
- స్వాగతం పలికిన విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్
- భోటెకోశి నదీ ప్రాంతంలో మళ్లీ పెరిగిన నీటి మట్టం
- మరోసారి వరదలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిక
- భోటెకోశి, త్రిశూలిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన





సుందర హిమాలయ దేశం నేపాల్‌లో మృత్యుఘోష కొనసాగుతూనే ఉంది. ఆకస్మిక వరదల ధాటికి మరణించిన వారి సంఖ్య శుక్రవారం 579కు చేరింది. గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎటు చూసినా శిథిలాలే కనిపిస్తున్నాయి. భోటెకోశి నదీ ప్రాంతంలో నీటి మట్టం ఒక్కసారిగా పెరగడంతో మరోసారి వరదలు వచ్చే ప్రమాదం ఉందన్న అంచనాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

**కఠ్మాండు/బీజింగ్, ఆగస్టు 28**

బుధవారం ఆకస్మిక వరద సంభవించిన చోటే బురదతో కూడిన నీటి మట్టం పెరిగిందని, ఇక్కడ మళ్లీ వరద వచ్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. భోటెకోశి, త్రిశూలి ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదం ఎదురైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. రసువా, సెంట్రల్ నేపాల్‌లోని ఇతర ప్రాంతాలను బుధవారం ముంచెత్తిన భారీ ఆకస్మిక వరదల కారణంగా వందల మంది మరణించడంతో పాటు భారీగా నివాస ప్రాంతాలు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ మౌలిక సదుపాయాలు

- మిగతా 2వ పేజీలో





## రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన
# మంత్రి కొండా సురేఖ

### మంత్రి సీతక్కతో కలిసి సీఎం ఇంటికి.. ముఖ్యమంత్రి ఆత్మీయ ఆహ్వానం

### సురేఖ కూతురు సుష్మిత వ్యాఖ్యల వేళ కీలక భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 28 (ప్రజాతీర్పు)**

రాఖీ పౌర్ణమి వేళ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఇటీవల రాజకీయంగా చర్చకు దారితీసిన మంత్రి కొండా సురేఖ.. మంత్రి సీతక్కతో కలిసి సీఎం ఇంటికి వెళ్లి రాఖీ కట్టారు. ఇద్దరు మంత్రులను సీఎం ఆత్మీయంగా ఆహ్వానించి, ఆశీస్సులు అందజేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి, ఇద్దరు మంత్రులు పరస్పరం స్వీట్లు తినిపించుకుని రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖలు పార్టీలో చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారాన్ని అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకోవడం.. సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పిస్తారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే

- మిగతా 2వ పేజీలో



# యుద్ధం ఇంకా ఉంది!

## ఇరాన్‌తో చర్చలు ప్రారంభించాలన్న ఆలోచన లేదు

### తేల్చిచెప్పిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 28**

పశ్చిమాసియాలో ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించి ఆరు నెలలవుతోంది. ఇప్పటికే వందలాది మంది మరణించారు. దాడులకు ముగింపు ఎప్పుడో ఎవరూ చెప్పలేకపోతున్నారు. యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ముగిస్తామని, పశ్చిమాసియాలో శాంతియుత వాతావరణం నెలకొల్పుతామని మొదట్లో పదేపదే ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేడు మాట మార్చేశారు. ఇరాన్‌పై దాడులను ఆపే విషయంలో తొందరపడడం లేదని అంటున్నారు. వైమానిక దాడులు, దిగ్బంధనం ద్వారా ఇరాన్ నాయకత్వాన్ని, సైన్యాన్ని,

- మిగతా 2వ పేజీలో



# అమెరికా నుంచి జావెలిన్ గైడెడ్ మిస్సైళ్లు

## ఒప్పందం కుదుర్చుకున్న భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ప్రజాతీర్పు)**

సైనిక పోరాట సామర్థ్యాన్ని పెంచుకొనే దిశగా భారత్ మరో కీలకమైన ముందడుగు వేసింది. అమెరికా నుంచి జావెలిన్ ట్యాంక్ విధ్వంసక క్షిపణి వ్యవస్థలను కొను గోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం భారత్, అమెరికా మధ్య మరింత గాఢం గా, ప్రభావవంతంగా మారుతున్న ద్వైపా క్షిక రక్షణ భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తోందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ అన్నారు. అమెరికా నుంచి భారత్ ఎన్ని జావెల్ యాంటీట్యాంక్ గైడెడ్ మిస్సైల్ సిస్టమ్స్‌ను కొనుగోలు చేస్తుందన్నది ఇంకా తెలియరాలేదు. ఈ కొనుగోలు మొత్తం వ్యయం ఎంత అనేది కూడా స్పష్టత లేదు. అమెరికా విదేశీ సైనిక అమ్మకాల ప్రక్రియ ద్వారా జావెలిన్ ట్యాంక్ విధ్వంసక క్షిపణి వ్యవస్థను కొనుగోలు చేసేందుకు భారత సైన్యం 'ఆఫర్, అంగీకార పత్రం'పై సంతకం చేయడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు

- మిగతా 2వ పేజీలో



# క్యూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు లక్కీ డ్రా

## అర్హత కలిగిన వారికే ఇళ్ల కేటాయింపు

### మరో 10 రోజుల్లో రెండో విడత షురూ: పొంగులేటి

**రాజేంద్రనగర్, ఆగస్టు 28**

గ్రేటర్ హైదరాబాద్ (క్యూర్) పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల ప్లాట్ల కేటాయిం పులో ఒక అరుదైన, భావోద్వేగ సంఘటన చోటుచేసుకుంది. అర్హులైన పేదలకు పారదర్శకంగా, లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించేందుకు ప్రభుత్వం శ్రీకారం

- మిగతా 2వ పేజీలో



# సాటిలేని ప్రభావం చూపిన జన్‌ధన్ యోజన

## ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు

### ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

### ప్రధానమంత్రి జన్‌ధన్ యోజనకు 12 ఏళ్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ప్రజాతీర్పు)**

ప్రజలందరికీ బ్యాంకు ఖాతాలు ఇవ్వాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన(పీఎంజేడీవై)కు 12 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ పథకం అపూర్వమైన ప్రభావాన్ని, గొప్ప ఫలితాలను సాధించిందని, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పును తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం

- మిగతా 2వ పేజీలో


# కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన హామీలు అమలు కాకపోవడాన్ని ప్రధానంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు.

మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, తులం బంగారం వంటి అంశాలతోపాటు ఇతర సంక్షేమ హామీల అమలు పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో వినూత్నంగా వంటావార్పు వంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సెప్టెంబర్ 5న విద్యార్థులు, యువత సమస్యలపై ప్రత్యేకంగా పోరాట కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, ఉద్యోగాల కల్పనతోపాటు యువతకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో యువతతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ఆదిలాబాద్‌లో సీసీఐ సమస్యలు, సింగరేణి ప్రాంతాల్లో ఆయా వర్గాల సమస్యలపై ప్రత్యేక నిరసన సదస్సులు నిర్వహించాలని సూచించారు. సెప్టెంబర్ 6న హైదరాబాద్లో నగర సమస్యలపై ఆటోలతో ప్రత్యేక ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. తాగునీరు, వీధిదీపాలు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బస్తీ దవాఖానాల నిర్వహణ వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. అదేరోజు మిగిలిన నియోజకవర్గాల్లో పల్లెల పరిస్థితి, పడకేసిన పారిశుద్ధ్య వ్యవస్థ, గ్రామీణ ప్రాంతాల సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సెప్టెంబర్ 7న జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని




కూడా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తిని వ్యక్తం చేసే వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. అన్ని జిల్లా, మండల ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యం, ప్రజలకు జరిగిన మోసంపై ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించాలని పార్టీ నాయకులను ఆదేశించారు. వారం రోజుల కార్యక్రమాల అనంతరం సెప్టెంబర్ 8న అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్మీట్లు నిర్వహించి, ఆయా జిల్లాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాలు, ప్రజల నుంచి వచ్చిన స్పందన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని సూచించారు. అదే సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించాలని తెలిపారు. సెప్టెంబర్ 10న జరగనున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసన కార్యక్రమాలకు కూడా బీఆర్ఎస్ సంఘీభావం ప్రకటించాలని కేటీఆర్ సూచించారు. పార్టీ చేపట్టనున్న ఈ వారం రోజుల కార్యాచరణను విజయవంతం చేయడంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమాలు విస్తృతంగా, ప్రజల భాగస్వామ్యంతో, సాధ్యమైనంత వినూత్నంగా నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలోని వైఫల్యాలు, అమలు కాని హామీలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ మొత్తం కార్యక్రమాలను పార్టీ కేంద్ర కార్యాలయం ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తుందని కేటీఆర్ తెలిపారు. ప్రతి కార్యక్రమంపై నివేదికలు తీసుకోవడంతోపాటు పార్టీ కేడర్ను అప్రమత్తం చేసి నాయకులకు అవసరమైన మార్గదర్శకాలు అందజేస్తామని చెప్పారు. పార్టీ నిర్దేశించిన కార్యాచరణను ప్రతి ఒక్కరూ తమ తమ కార్యక్షేత్రాల్లో విజయవంతం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



# యుద్ధం ఇంకా ఉంది!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక వ్యవస్థను చాలావరకు నాశనం చేశానని ట్రంప్ తాజాగా వెల్లడించారు. ఇరాన్‌ను తమ దారికి తెచ్చేందుకు సైనిక చర్యకు బదులుగా, ఆర్థికంగా ఒత్తిడిని పెంచడంపైనే దృష్టి సారిస్తున్నట్లు ట్రంప్ ప్రభుత్వం పేర్కొంది. ఇరాన్‌తో వ్యాపారం కొనసాగించే ఏ దేశమైనా లేదా సంస్థ అయినా కఠిన ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఆంక్షలను ప్రధాన ఆయుధంగా ఉపయోగించాలని అమెరికా నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇరాన్ నాయకత్వం ఇప్ప టికే చాలావరకు బల హీన పడిందని డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. వారు (ఇరాన్) సైని కులకు జీతాలు చెల్లించడం లేదని, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. ఇరాన్ సామర్థ్యం చాలా తక్కువగా ఉందన్నారు. ఇరాన్‌తో ఇప్పటికిప్పుడు చర్చలు ప్రారంభించాలన్న ఉద్దేశం కూడా లేదని స్పష్టంచేశారు. అందుకు సమయం ఉందని పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఇరాన్‌పై యుద్ధం వల్ల అమెరికాకు 37.5 బిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లినట్లు అంచనా. పశ్చిమాసియా సంక్షోభానికి దౌత్యపరమైన పరిష్కారం కనిపెట్టేందుకు ఖతార్, పాకిస్తాన్‌లు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. త్వరగా చర్చలు ప్రారంభించాలని అమెరికా, ఇరాన్‌లను కోరుతున్నాయి. మొత్తం సమస్యకు హార్మూజ్ జలసంధి కేంద్ర బిందువుగా మారింది. జలసంధిపై పట్టుకోసం అమెరికా, ఇరాన్‌లు ఆరాటపడుతున్నాయి. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు ప్రారంభించడం లక్ష్యంగా జూన్‌లో కుదిరిన ప్రాథమిక ఒప్పందంపై ట్రంప్ పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

# ప్రచురించేది మేము కాదు

## సోనియా ఆత్మకథపై పెంగ్విన్ వెల్లడి

## మార్పులకు సోనియా నోఅనడమే కారణమా?

**న్యూఢిల్లీ, ఆగస్టు 28 (ప్రజాతీర్పు)**

ప్రచురణ సంస్థ 'పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా'మరోసారి వివాదాల్లో చిక్కుకుంది. సోనియాగాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'భారత ప్రచురణకర్తలు తాము కాదని శు క్రవారం ప్రకటించింది. "చర్చలు జరుగుతున్నంత కాలం ఈ పుస్తక ప్రచురణపై తాము ఆసక్తిగానే ఉన్నామని... అయితే రచయితల ఫ్యాక్ట్ చెక్ చేయడం తమ బాధ్యత, నిర్ణయాధికారం"అని వ్యాఖ్యానించడంతో వివాదం మొదలైంది.

కొన్ని వారాల క్రితమే పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇంప్రింట్‌గా పుస్తకాలు ప్రచురించే అమెరికన్ పబ్లిషర్ ఆల్ఫ్రెడ్ ఏ క్నాఫ్.. సోనియాగాంధీ ఆత్మకథ ఈ ఏడాది నవంబరు పదవ తేదీన విడుదల అవుతుందని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పుస్తకంలో కొన్ని మార్పులు చేసేందుకు సోనియాగాంధీ నిరాకరించడంతో పెంగ్విన్ ప్రచురణ విషయంలో వెనక్కు తగ్గిందని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఒక కథనాన్ని ప్రచురించింది. "బిలాంగింగ్ పుస్తకం భారత పబ్లిషర్ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా కాదు. అయితే పుస్తకంలో కొన్ని మార్పులు చేసేందుకు రచయిత నిరాకరించడం వల్ల పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తే... అది వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టేది కాదు"అంటూ పెంగ్విన్ తన ప్రకటనలో తెలిపింది. "వాస్తవాలను సరిచూడటం, రచయిత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వారికి సలహా, సూచనలు చేయడం ప్రచురణకర్తలుగా మా బాధ్యత, నిర్ణయాధికారం. ప్రచురణ ప్రక్రియలో ఇది సాధారణంగా జరిగేదే. చర్చలు కొనసాగినంత కాలం పెంగ్విన్ పుస్తక ప్రచురణపై ఆసక్తి కనబరిచింది"అని వివరించింది. ఇంతకు మించి రచయితతో తాము జరిపిన చర్చల వివరాలను వెల్లడించలేమని స్పష్టం చేసింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.... ప్రచురణ కర్త ఎవరో స్పష్టం కాకపోయినా ఈ పుస్తకం రూ.2615లకు ప్రీ ఆర్డర్ చేయవచ్చు అని ఈకామర్స్ వెబ్‌సైట్ అమెజాన్‌లో కనిపించడం!! ఇందులో ప్రచురణ కర్తగా యూకేకు చెందిన హార్పర్ కాలిన్స్ ఇన్‌ప్రింట్ "విలియం కోలిన్"గా పేర్కొన్నారు.

### ప్రభుత్వ ఒత్తిడి వల్లే: కాంగ్రెస్

సోనియా గాంధీ ఆత్మకథను ప్రచురించే విషయంలో పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా వెనక్కు తగ్గడం కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి వల్లేనని పలువురు కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా ఇంప్రింట్ ఆల్ఫ్రెడ్ ఏ క్నాఫ్ ముద్రిస్తూండగా లేనిది భారత్‌లో పెంగ్విన్ ఇండియా ముద్రించకుండా ఎవరు ఆపుతున్నారని ఆ పార్టీ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ విమర్శించారు. "ఒత్తిడి తీసుకొచ్చి నిలిపేయడం అన్నది భావ ప్రకటన స్వేచ్ఛను హత్య చేయడంతో సమానం"అని వ్యాఖ్యానించారు. మోదీ, ఆర్ఎస్ఎస్‌లకు సంబంధించిన సమాచారం, మోదీ హయాంలో చైనా భారత్‌లోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించిన వైనాలను తొలగించాలని పెంగ్విన్ ఇండియాపై ఒత్తిడి వచ్చిందని ఆరోపించారు.

# నేపాల్‌లో ఆగని మృత్యుఘోష

(మొదటి పేజీ తరువాయి)

ధ్వంసమయ్యాయి. ఎనిమిది జిల్లాల్లో ఇప్పటిదాకా 579 మృతదేహాలను వెలికితీసినట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు. వేలాది మంది గల్లంతయ్యారు. ఇప్పటికీ వారి జాడ తెలియరావడం లేదు. నవల్‌పరాసి ఈస్ట్‌లో 154, చిత్వాన్‌లో 233, గోర్ఖాలో 46, నువాకోట్‌లో 37 మృతదేహాలను వెలికితీశారు. అలాగే ధాడింగ్‌లో 40, తానాహులో 30, నవల్‌పరాసి వెస్ట్‌లో 27, రసువాలో 12 మృతదేహాలను వెలికితీశారు. టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలోని గిరోంగ్ కౌంటీలో ఐదుగురు మరణించారు. వరదలు సంభవించినప్పటి నుంచి 86 మంది భద్రతా సిబ్బంది, 517 మంది విదేశీ పర్యాటకులు, 127 మంది నేపాలీ ప్రయాణికులతో సహా కనీసం 1,924 మంది గల్లంతయ్యారు. ఇప్పటివరకు వివిధ ప్రభావిత ప్రాంతాల నుంచి 4,451 మందిని రక్షించారు. వీరిలో 85 మంది భారతీయులతో సహా మొత్తం 129 మంది విదేశీయులు, అలాగే వివిధ జలవిద్యుత్ ప్రాజెక్టుల సొరంగాల్లో చిక్కుకుపోయిన 191 మంది ఉన్నారు. గాయపడిన 101 మంది రాజధాని కఠ్మాండులోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు తమ వారి కోసం ఆసుపత్రుల్లో వెతుకుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి శు క్రవారం మధ్యాహ్నం వరకు 85 మంది భారతీయులు, 9 మంది దక్షిణ కొరియన్లు, 16 మంది చైనా పౌరులతో సహా మొత్తం 121 మంది విదేశీ పర్యాటకులను రక్షించినట్లు నేపాల్ పర్యాటక బోర్డు ప్రకటించింది. గాలింపు, సహాయక చర్యలు మూడో రోజు మరింత ముమ్మరంగా కొనసాగాయని, ఇందులో 2,391 మంది నేపాల్ సైనిక సిబ్బందితో సహా మొత్తం 7,451 మంది భద్రతా సిబ్బంది భాగస్వాములయ్యారని ప్రభుత్వం వెల్లడించింది.

బాధితులను తరలించడానికి హెలికాప్టర్లను ఉపయోగించగా, భూతల బృందాలు నదీ తీరాల్లో, దిగువన ఉన్న నివాస ప్రాంతాల్లో గాలింపు కొనసాగిస్తున్నాయి. మరోవైపు ఆసుపత్రుల్లో మృతదేహాలను భద్రపర్చడానికి తగినంత స్థలం లేకపోవడం సమస్యగా మారింది. విపత్తు సహాయ నిధికి తమ ఒక నెల వేతనాన్ని విరాళంగా



ఇవ్వాలని నేపాల్ ప్రధానమంత్రి బాలేంద్ర షా, ఆయన మంత్రివర్గ సభ్యులు నిర్ణయించారు. ఆకస్మిక వరదల వల్ల నష్టపోయిన పౌరులు, వ్యాపార సంస్థల కోసం సహాయం, రాయితీతో కూడిన పునరావాస ప్యాకేజీని రూపొందించాలని మంత్రివర్గం ఆర్థిక శాఖను ఆదేశించింది.

టిబెట్‌నేపాల్ సరిహద్దు సమీపంలోని గిరోంగ్ కౌంటీ నుంచి 555 మంది పర్యాటకులతో సహా 1,000 మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చైనా అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం అక్కడ పర్యాటకులెవరూ లేరని చెప్పారు. చైనా వైపున ఉన్న ఓడరేవుకు వెళ్లే రహదారులు ఆకస్మిక వరదల వల్ల తెగిపోయాయి. దీనివల్ల సమాచార వ్యవస్థలు, విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది.

### మరో 10 టన్నుల సహాయక సామగ్రి

వరదలతో అతలాకుతలమైన నేపాల్‌కు మూడో విడత కింద 10 టన్నుల సహాయక సామగ్రిని, 11 మంది సభ్యులతో కూడిన వైద్యులు, పారామెడిక్స్ బృందాన్ని, అలాగే సొరంగంలో సహాయక చర్యలను అంచనా వేసే బృందాన్ని భారత్ శుక్రవారం పంపించింది. ఇందులో పోర్టబుల్ జనరేటర్ సెట్లు, డిగ్నిటీ కిట్లు, ఆహార ప్యాకెట్లు, నీటి శుద్ధి మాత్రలు ఉన్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. నేపాల్‌లో కొనసాగుతున్న సహాయక, రక్షణ చర్యలకు భారత్ మద్దతును కొనసాగిస్తోందని పేర్కొన్నారు. బుధవారం 10 టన్నుల మానవతా సహాయం, విపత్తు సహాయక సామగ్రిని, గురువారం మరో 37.5 టన్నుల సహాయక సామగ్రిని నేపాల్‌కు భారత్ పంపింది. నేపాల్‌కు అన్ని విధాలా సహాయం అందిస్తామని భారత ప్రధాని మోదీ ఇప్పటికే భరోసా ఇచ్చారు.

### 320 మంది భారతీయులు మిస్సింగ్

నేపాల్‌టిబెట్ సరిహద్దులో సంభవించిన భారీ ఆకస్మిక వరదల కారణంగా కనీసం 320 మంది భారతీయులు గల్లంతయ్యారని, మరో 400 మంది చైనా వైపు చిక్కుకుపోయారని, వారంతా ప్రస్తుతం క్షేమంగానే ఉన్నారని భారత విదేశీ వ్యవహారాల శాఖ శుక్రవారం తెలిపింది. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్ సాధ్యమైనంత సహాయం అందించడానికి భారత్ సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. చైనా వైపు చిక్కుకుపోయిన 96 మంది భారతీయులు భూమార్గం ద్వారా సురక్షితంగా నేపాల్‌కు చేరుకున్నారని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం 21 మంది తమిళనాడు వాసులను ఢిల్లీకి చేర్చినట్లు చెప్పారు. వీరికి ఢిల్లీ విమానాశ్రయంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్వాగతం పలికారు. ఈ 21 మంది కైలాస మానసరోవర్ యాత్ర వెళ్లి వరదల్లో చిక్కుకోగా నేపాల్ సైన్యం రక్షించింది. ఎస్.జైశంకర్ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. నేపాల్‌లో గల్లంతైన భారతీయుల ఆచూకీ సాధ్యమైనంత త్వరగా గుర్తించాలని ఆదేశించారు.



# రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి సీతక్కతో కలిసి కొండా సురేఖ ఒకే కారులో సీఎం ఇంటికి రావడం, రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. సీఎం మనువడు, అల్లుడికి కూడా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం నివాసంలో సురేఖ కొంతసేపు ఆత్మీయంగా గడిపారు. ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఇద్దరి భేటీ ఎలా ఉంటుందన్న ఆసక్తి కాంగ్రెస్ వర్గాల్లో నెలకొన్నప్పటికీ.. అందుకు భిన్నంగా ఇద్దరు మంత్రులను సీఎం సాదరంగా ఆహ్వానించి, రాఖీ కట్టించుకోవడం చర్చనీయాంశమైంది. సీఎం వ్యవహరించిన తీరు ఆయన పెద్ద మనసుకు నిదర్శనమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన వారిలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయల, సభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, బ్రహ్మకుమారీలు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మలక్‌పేట్‌లోని గవర్నమెంట్ హైస్కూల్ ఫర్ ది బ్లైండ్ విద్యార్థినులు ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన అనంతరం మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. 'పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. నేను అందరికీ సోదరీమణినే. తెలంగాణలోని ప్రతి కుటుంబం నన్ను వారి కుటుంబ సభ్యురాలిగానే ఆదరిస్తున్నారు' అని మంత్రి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలోని మహిళల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉంటుందని.. సీఎం ఆశీర్వాదాలు కూడా తెలంగాణలోని అడపడుచులపై ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. గత మూడేళ్లుగా ప్రతిసారి సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్నట్లే.. ఈసారి కూడా రాఖీ కట్టానని చెప్పారు. ఆదివాసీ బిడ్డనైన తనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సోదరిగా భావిస్తూ ఈ స్థాయికి రావడానికి కారకులు అయ్యారని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా 12 సంవత్సరాలుగా రేవంత్‌రెడ్డిని తన సొంత సోదరుడిగా భావిస్తూ రాఖీ కడుతున్నానని పేర్కొన్నారు. ములుగు ప్రజల ఆశీస్సులు దీవెనలతో నా జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేస్తున్నానని, తాను ఇంతటి స్థాయికి తీసుకొచ్చిన ములుగు ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని మంత్రి తెలిపారు.

# క్యూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు లక్కీడ్రా

(మొదటి పేజీ తరువాయి)

చుట్టింది. మొదటి దఫాలో భాగంగా మొత్తం 7,350 ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లక్కీ డ్రా నిర్వహించారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్దేవుపల్లి (లక్ష్మీగూడ)లో నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమం లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఒక చిన్నారి చేతుల మీదుగా లక్కీ డ్రా టోకెన్ తీయించారు. ఆ చిన్నారి తీసిన టోకెన్‌లో .. సొంత కుటుంబానికే (జరపుల లక్ష్మి) ఇల్లు వరించింది. ఈ అరుదైన ఘట్టంపై మంత్రి శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ.. చిన్నపిల్లలు దేవుళ్లతో సమానం, వారు అత్యంత స్వచ్ఛమైన మనస్సు గలవారు. పేదల సొంతింటి కల తీర్చాలనే మా ప్రభుత్వ సంకల్పానికి దేవుడి ఆశీస్సులు తోడయ్యాయి. చిన్నోడు తీసిన లక్కీ డ్రాలో వారి కుటుంబానికే ఇల్లు రావడం మా అందరినీ ఎంతో ఆనందానికి గురిచేసింది. ఆ కుటుంబం ఈ సొంతింటిలో జీవితాంతం చల్లగా ఉండాలని మనసారా ఆశీర్వదిస్తున్నాను' అని తెలిపారు. కులం, మతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా కేవలం అర్హత ఆధారంగానే నిష్పక్షపాతంగా ఇళు కేటాయించామని మంత్రి చెప్పారు. మరో 10 రోజుల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను విడుదల చేస్తామన్నారు. క్యూర్ పరిధిలో ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తి చేశామన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో టవర్ల నిర్మాణం ప్రారంభమవుతుందని తెలిపారు. ఇళ్ల రిజిస్ట్రేషను లబ్ధిదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయడం లేదని, రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత అవసరాల కోసం ఇంటినీ తాకట్టు పెట్టుకునేందుకు అనుమతి ఇస్తామన్నారు. పదేళ్ల తర్వాత ఆ ఇంటిని అమ్ముకునే హక్కు కూడా లబ్ధిదారులకే ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు.

# సాటిలేని ప్రభావం చూపిన జన్‌ధన్ యోజన

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తంచేశారు. జన్‌ధన్ యోజన సాటిలేని ప్రభావాన్ని చూపిందని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. అలాగే జన్‌ధన్ యోజనపై ప్రభుత్వం చేసిన పోస్టును షేర్ చేశారు. పథకం ఘనతలను ప్రస్తావించారు. పీఎంజేడీవైని ప్రధాని మోదీ 2014 ఆగస్టు 28న ప్రారంభించారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన మార్పులకు నాంది పలికింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సమ్మిళితానికి దిక్సూచిగా నిలిచింది. భారతీయులందరికీ బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఒక కొత్త ఒరవడిని సృష్టించింది. బ్యాంకు సేవలు అందుబాటులో లేని ప్రతి వయోజనునికి, ఎలాంటి కనీస నిల్వ అవసరం లేకుండా, నిర్వహణ రుసుముల భారం లేకుండా ఈ పథకం ద్వారా ప్రాథమిక బ్యాంకు ఖాతా లభిస్తుంది. ప్రతి ఖాతాతోపాటు ఉచితంగా రూపే డెబిట్ కార్డు కూడా పొందవచ్చు. రూ.2 లక్షల ప్రమాద బీమా కవరేజీ లభిస్తుంది. డిజిటల్ లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఖాతాదారులు రూ.10,000 వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయాన్ని పొందవచ్చు. ఇది అత్యవసర సమయాల్లో రక్షణ కవచంలా ఉపయోగపడుతుంది.

### 33 కోట్ల మంది మహిళలకు ఖాతాలు

బ్యాంకు ఖాతా అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదని.. ఒక ఆర్థిక గుర్తింపుగా నిలుస్తుందని ప్రభుత్వం స్పష్టంచేసింది. 2015లో 14.7 కోట్లుగా ఉన్న జన్‌ధన్ ఖాతాల సంఖ్య 2026 నాటికి 59 కోట్లకు చేరుకున్నాయి. తద్వారా కోట్లాది మంది ఆర్థిక వ్యవస్థ పరిధిలోకి చేరారు. అధికారిక ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం విస్తరించింది. నేడు దాదాపు 33 కోట్ల మంది మహిళలు జన్‌ధన్ ఖాతాలను కలిగి ఉన్నట్లు ప్రభుత్వం స్పష్టంచేసింది. ఇది మొత్తం జన్‌ధన్ ఖాతాదారులలో 56 శాతం కావడం విశేషం.

అధికారిక బ్యాంకింగ్ సేవలు విస్తృతంగా అందుబాటులోకి రావడం వల్ల ఎక్కువ మంది మహిళలు ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతున్నారని ప్రభుత్వం వెల్లడించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 46 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ఉన్నాయి. ఇవి మొత్తం జన్‌ధన్ ఖాతాల్లో 78 శాతం. కోట్లాది జన్‌ధన్ ఖాతాలు, గ్రామీణ ప్రాంతాలకు సేవల విస్తరణ, మహిళల భాగస్వామ్యం, చివరి వ్యక్తి వరకు బ్యాంకింగ్ సేవలు చేరడం వంటివి నేడు భారతదేశ బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రతీకగా నిలుస్తున్నాయని ప్రభుత్వం స్పష్టంచేసింది.

# అమెరికా నుంచి జావెలిన్ గైడెడ్ మిస్సైళ్లు

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ పరిణామం అమెరికా, భారత సాయుధ దళాల మధ్య శాశ్వత భాగస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుందని, అలాగే ఇరుదేశాల రక్షణ పరిశ్రమల మధ్య భవిష్యత్ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని పేర్కొంది.



# ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల పర్యవేక్షణ

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగష్టు 28.**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతోంది అని జగిత్యాల నియోజకవర్గం లో తాటిపల్లి శివారులో 25 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను శుక్రవారం అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు. తెలంగాణ ముఖ్యమంత్రి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు ప్రధాన ఉద్దేశ్యం పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో అందించడం అని అన్నారు. 2500 మంది విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య హాస్టల్, భోజనం వంటి వసతి సౌకర్యాలు ప్రయోగశాలలు, లైబ్రరీ, కంప్యూటర్ సదుపాయాలు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అందించడం ప్రాధాన్యత అని,విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం అన్ని వర్గాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని అన్నారు.జగిత్యాల నియోజకవర్గానికి 200 కోట్ల తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి జగిత్యాల ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య,ఏ ఎం సి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి,సర్పంచులు బొలిశెట్టి గంగారెడ్డి, కట్ట రాజేందర్,మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి,పెండెం రాములు, మాజీ సర్పంచ్ లు నక్కల రవీందర్ రెడ్డి,బాల ముకుందం,గంగారాం,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుభూమారెడ్డి,నాయకులు మల్లేశం గౌడ్,సురేష్,సదానందం,సతీష్ ,గంగారెడ్డి, మహేష్, మనోజ్, దిలీప్,వెంకటేష్, ఎమ్మార్వో హకీమ్, ఏ ఈ లు శశి, ధనుంజయ్, తాటిపల్లి, చల్గల్,మోరపల్లి గ్రామాల నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# శుక్ర గ్రహ శాంతి పూజ

## అర్చకులు శివ శంకర వరప్రసాద్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 28**

అసలు శుక్రుడు అంటే ఎవరు అసురులకు మార్గదర్శనం చేస్తూ అసురులను అప్పుడు ఎలా కాపాడుతూ వారికి విద్యలు బోధించే వాడు,శుక్రుడు. శుక్ర మహా దశలో శుక్రుడు అనుకూలంగా ఉంటే జీవితం సుఖసంతోషాలుగా విరజల్లును అలాగే ప్రేమ వివాహాలు, నూతన గృహ నిర్మాణాలు పిల్లలతోని ప్రేమ అలాగే భార్యాభర్తలు ప్రేమగా ఉండడం జరుగుతుంది. శుక్ర మహర్దశ 20 సంవత్సరాలు ఉంటుంది. శుక్ర మహర్దశ బాగోలేని వ్యక్తికి ఉన్న ఇంట్లో ఇబ్బందులు మానసిక వేదన చికాకు అనారోగ్య పాలు కావడం,భార్య పిల్లలతో చీటికిమాటికి గొడవలు పడడం సమస్యలు రావడం, పిల్ల నుంచి ప్రేమ దొరక పోవడం, ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటారు. శుక్ర గ్రహ శాంతి పూజ చేయించుకుంటే. ఇలాంటి సమస్యలు నుంచి బయట పడవచ్చునని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని 2 వార్డు శివాలయం అర్చకులు, ఎడెల్లి శివశంకర వరప్రసాద్. తెలపడంతో బెల్లంపల్లి నివాసులమైన మేము మా ఇంట్లో శని నవగ్రహ పూజ చేయించడం జరిగింది అర్చకులు శివ శంకర వరప్రసాద్ ఎంతో ఓపికతో ఎంతో అనుభవం ఉన్న వ్యక్తిగా తను చేసిన మంత్రోచ్చారణ మమ్ములను ఎంతగానో ఆనందింప చేసింది వారికి మా కృతజ్ఞతలు.

# ఘనంగా జంధ్యాల పౌర్ణమి గాయత్రి హోమం




**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగష్టు 28**

శ్రావణ జంధ్యాల పౌర్ణమి రాఖీ బంధన్ సందర్భంగా శుక్రవారం జగిత్యాల గాయత్రి జ్ఞాన మందిర్ లో మహా గాయత్రి వరుణ యజ్ఞం నిర్వహించారు. ప్రపంచ శాంతి కొరకు. గాయత్రి జ్ఞాన మందిర్ జగిత్యాలలో ప్రతి పౌర్ణమి, అమావాస్య సందర్భంగా నిర్వహించబడుతున్న గాయత్రి యజ్ఞం మరియు ఈరోజు జంధ్యాల పౌర్ణమి సందర్భంగా గాయత్రీ పరివార్ సభ్యులు భక్తులు జంధ్యాలను మార్చుకొని కొత్త జంధ్యాలను వేసుకోవడం జరిగినది. పరివార్ ప్రతినిధి కొమురవెల్లి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో కనపర్తి నాగభూషణం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం అన్న ప్రసాదం గావించారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, మంచి గంగారాం, పోచమ్మల సంపత్ , మండలూజు భాస్కర్, గడ్డమీది గంగాధర్, లంబ తిరుపతి, కనికరం లచ్చన్న, గణపతి నాగభూషణం, చలిగాలి శంకర్ , కొమురవెల్లి లక్ష్మి, గంగ లక్ష్మి, రమ, వడ్లూరి లక్ష్మీనారాయణ భక్తులు పాల్గొన్నారు.

# అనంతుల ఇంట.. ఆనందాల పూదోట

## వెల్లివిరిసిన రాఖీ సంబురాలు











**(ప్రజాతీర్పు ప్రతినిధి, సూర్యాపేట జిల్లా)**

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అనంతుల శ్రీనివాస్ గౌడ్ ఇంట శు క్రవారం ఆనందాలు వెల్లివెరిశాయి. రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ఆ కుటుంబం ఉదయాన్నే రాఖీ పండుగకు స్వాగతం పలుకగా, ఆ తర్వాత ఆ ఇంటి ఆడపడుచులను అంతే సాదరంగా ఆహ్వానించింది. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అనంతుల శ్రీనివాస్ గౌడ్‌కు ఆయన అక్కా చెల్లెళ్లు రాఖీలు కట్టారు. సంప్రదాయ బద్ధంగా సాగిన ఈ కార్యక్రమంలో నీవు నాకు తోడు.. నేను నీకుతోడు అంటు అన్నాదమ్ములు.. అక్కా చెల్లెళ్లు తమలోని భావాన్ని వ్యక్తపరిచారు. కొద్దిసేపు ఆ ఇల్లు అక్కాచెల్లెళ్లు.. అన్నదమ్ముల అనుబంధానికి మారుపేరుగా నిలిచింది. రక్షాబంధన్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఎంతో సంబరాలతో రాఖీ పండుగ ప్రజలంతా జరుపుకున్నారు. ప్రతి కుటుంబంలోని వారు తన అన్న చెల్లెలు అక్క తమ్ముళ్ళతో ఉన్న అనుబంధాన్ని ఈ పండుగ ద్వారా మరోసారి చాటుకున్నారు. ఈ పండుగ అనేది వందల సంవత్సరాల నుంచి మన పూర్వీకుల నుంచి వచ్చిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అనంతుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. అన్నాదమ్ముల మధ్య అనుబంధాన్ని చాటే ఇలాంటి పండుగ మన చోట తప్ప ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. ఈ రాఖీ పండుగ రోజు నాడు ప్రతి అక్క చెల్లెలు తన అన్నదమ్ములకు రాఖీ బంధనం చేస్తే వారికి వారి కుటుంబ సభ్యులకు మంచి మంచి జరుగుతుందని వివరించారు.



## ‘వాల్మీకి’ స్కామ్ ఎఫెక్ట్.. కర్ణాటక మంత్రి రాజీనామా!

కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ‘మహర్షి వాల్మీకి కార్పొరేషన్’ స్కామ్‌లో కీలక పరిణామం చోటు చేసుకొన్నది. స్కామ్‌కు సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక మంత్రి బీ నాగేంద్ర శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో కన్నీటి పర్యంతమైన ఆయన.. తనపై కుట్ర జరిగినట్టు పేర్కొన్నారు. నాగేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయడం ఇది రెండోసారి. ఇదే స్కామ్ ఆరోపణల్లో 2024లో అప్పటి సిద్దరామయ్య క్యాబినెట్‌లోఎస్టీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర తన పదవి నుంచి తప్పుకున్నారు. కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్’కు చెందిన పలు బ్యాంకు ఖాతాల్లో ఉండాల్సిన రూ.187 కోట్లు పక్క దారి పట్టాయి. వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ పీ చంద్రశేఖరన్ 2024 మే 26న ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కుంభకోణం వెలుగు చూసింది. ఈ స్కామ్ గురించి చంద్రశేఖరన్ తన ఆరు పేజీల సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. యూనియన్ బ్యాంకు సైతం తమ బ్యాంకులోని వాల్మీకి కార్పొరేషన్ ఖాతా నుంచి చట్టవిరుద్ధంగా నగదు బదిలీ అయ్యిందని ఫిర్యాదు చేసింది.



## విద్యార్థులపై ప్రాణాంతక బల ప్రయోగం!

ఢిల్లీలో జెన్-జీ జూలైలో చేపట్టిన నిరసనలపై పోలీసుల స్పందనను డాక్యుమెంట్ చేస్తూ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఒక డిజిటల్ విచారణ నివేదికను ప్రచురించింది. ఆగస్టు 24న ప్రచురించిన ఈ విచారణ నివేదికలో.. భారత పోలీసులు శాంతియుత నిరసనకారులపై చట్టవిరుద్ధమైన, ప్రాణాంతకమైన బలాన్ని ప్రయోగించారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తెలిపింది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ ‘ఎవిడెన్స్ ల్యాబ్’ వీడియో, ఫొటో ఆధారాలను పరిశీలించి ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఢిల్లీ, బిహార్‌లోని సీవాన్‌లో నిరసనకారులపై పోలీసులు పెల్లెట్ గన్స్, టియర్ గ్యాస్, గ్రెనేడ్లు, లాఠీలు, ఎలక్ట్రిక్ షాక్ పరికరాలు వంటి ఆయుధాలను ఉపయోగించినట్టు స్పష్టం చేసింది. బలప్రయోగం ద్వారా నిరసనలను అణచివేయడానికి భారత అధికారులు యత్నించారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా బోర్డు చైర్‌పర్సన్ ఆకార్ పటేల్ ఆరోపించారు. ఈ రకమైన తీవ్రమైన స్పందన అనేది శాంతిభద్రతల నియంత్రణ ముసుగులో ప్రభుత్వం చేసిన హింసగా తెలిపారు.

# ప్రభుత్వ సీలింగ్ భూముల్లో లక్షల రూపాయల ‘అక్రమ’ పండగ

- ముున్సిపల్ అనుమతుల ధనదాహం.
- రెవెన్యూ ‘సెటిల్మెంట్’ దందా!:
- స్లాబ్ పడేదాకా సైలెంట్.. ఆపై పనుల బంద్!.
- స్లాబ్ వేశాక రంగంలోకి రెవెన్యూ సైన్యం.. ఆర్ఐ, ఎమ్మార్వో ‘అండర్‌గ్రౌండ్’ డీల్స్!.

**మేడిపల్లి, ఆగస్టు 28 ( ప్రజాతీర్పు )**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పర్వతాపూర్ పరిధిలోని సీలింగ్ భూములు అక్రమార్కులకు, అవినీతి అధికారులకు కామధేనువుగా మారాయి. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన మున్సిపల్,రెవెన్యూ అధికారులు ఒకరికొకరు తోడై లక్షల రూపాయల దోపిడీకి తెరలేపారు. స్లాబ్ పడేవరకు మున్సిపల్ యంత్రాంగం నిద్ర నటిస్తే, స్లాబ్ వేసిన తర్వాత రెవెన్యూ శాఖ సీన్‌లోకి వచ్చి ‘సెటిల్మెంట్లు’ చేసుకోవడం ఇక్కడ నిత్యకృత్యంగా మారింది.

స్లాబ్ పడేదాకా మున్సిపల్ కన్నుల పండగ!లి

పర్వతాపూర్ సర్వే నంబర్లలోని ప్రభుత్వ సీలింగ్ స్థలాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలకు బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ,టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి భారీ మొత్తంలో ఆమ్యామ్యాలు పుచ్చుకొని పచ్చజెండా ఊపుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ భూమి అని తెలిసినా, సీలింగ్ జాబితాలో ఉన్నా.. అందినంత నొక్కుకొని మున్సిపల్ ప్లాన్ ఆమోదాలు జారీ చేసేస్తున్నారు. నిర్మాణం మొదలై స్లాబ్ పడేవరకు ఈ మున్సిపల్ అధికారులు సైలెంట్‌గా ఉంటూ బిల్డర్లను




ముందంజ వేయిస్తున్నారు.

### స్లాబ్ పడ్డాక రెవెన్యూ ఎంట్రీ.. సెటిల్ అయితే ఓకే!

భవనం నిర్మాణం పూర్తయి స్లాబ్ వేయగానే మున్సిపల్ అధికారులు ఈ సమాచారాన్ని చాటుమాటుగా రెవెన్యూ సిబ్బందికి చేరవేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో వెంటనే రంగంలోకి దిగుతున్న ఆర్ఐ,ఎమ్మార్వో బృందం..”ఇది ప్రభుత్వ సీలింగ్ భూమి, ప్లాన్ ఎలా ఇస్తారు?” అంటూ నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారు (స్టాప్ వర్క్). నిర్మాణ దారులు భయపడి దిగిరాగానే, ఎమ్మార్వో పరిధిలో భారీ స్థాయిలో ‘అండర్‌గ్రౌండ్’ సెటిల్మెంట్లు నడుపుతున్నారు. డిమాండ్ చేసిన నోట్ల కట్టలు రెవెన్యూ అధికారుల చేతికి అందగానే, పనులు మళ్లీ యథాతథంగా సాగిపోతుండటం విశేషం.

### జిల్లా కలెక్టర్, ఏసీబీ స్పందించేదెప్పుడు?



ఒకవైపు మున్సిపల్ డీసీ శైలజ, ఏసీపీ నాగిరెడ్డి అనుమతుల పేరుతో జేబులు నింపుకుంటే.. మరోవైపు స్లాబ్ పడిన తర్వాత రెవెన్యూ అధికారులు బెదిరింపు సెటిల్మెంట్లతో రూ. లక్షల వెనకేసుకుంటున్నారు. ఈ రెండు శాఖల అధికారులు చేతులు కలిపి ప్రభుత్వ ఆస్తులను విక్రయిస్తున్నా ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణకు ఆదేశించి,ఏసీబీ అధికారులతో దాడి చేయించి ఈ అవినీతి తిమింగలాల ఆట కట్టించాలని స్థానికులు మరియు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# కరీనగర్‌లో శిశుమందిర్ విద్యార్థుల సౌభ్రాతృత్వ సందేశం

**కరీంనగర్, ఆగస్టు 28 (ప్రజాతీర్పు)**





రక్షాబంధన్ పర్వదిన స్ఫూర్తిని సమాజంలో విస్తరింపజేయడంతో పాటు సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం, సామాజిక ఐక్యత మరియు దేశభక్తి భావాలను ప్రజల్లో పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రీ సరస్వతీ శిశుమందిర్ హై స్కూల్, కరీనగర్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కరీంనగర్ పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా, కోర్ట్ చౌరస్తా, భగత్‌సింగ్ సర్కిల్, కమాన్ సర్కిల్ మరియు విద్యానగర్ ప్రాంతాల్లోని దుకాణాలు, కార్యాలయాలు, వివిధ సంస్థలను సందర్శించి వారికి రాఖీలు కట్టారు. ప్రత్యేకంగా ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, సివిల్ పోలీసు సిబ్బంది వద్దకు వెళ్లి విద్యార్థినులు ఆత్మీయంగా రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా వారు, "మీకు మేము రక్ష... మాకు మీరు రక్ష... మనందరం దేశానికి రక్ష!" అనే సందేశాన్ని అందిస్తూ రక్షాబంధన్ యొక్క విశాలమైన అర్థాన్ని చాటి చెప్పారు. రాఖీ అనేది కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే బంధానికి మాత్రమే ప్రతీక కాదని, ఒకరినొకరు గౌరవించుకోవడం, అవసరమైనప్పుడు ఒకరికొకరు అండగా నిలవడం, సమాజ భద్రత కోసం కలిసి పనిచేయడం, దేశం పట్ల బాధ్యతను కలిగి ఉండడం వంటి ఉన్నతమైన విలువలకు ప్రతీక అని విద్యార్థులు తెలియజేశారు. విధినిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది విద్యార్థుల కార్యక్రమాన్ని అభినందిస్తూ, చిన్న వయసులోనే విద్యార్థుల్లో దేశభక్తి, సామాజిక బాధ్యత మరియు సోదరభావం వంటి విలువలను పెంపొందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు సమాజాన్ని అర్థం చేసుకునే దృష్టి, సేవాభావం, క్రమశిక్షణ, బాధ్యత మరియు భారతీయ సంస్కారాలను అందించడం శిశుమందిర్ విద్యా విధానంలో ముఖ్యమైన భాగమని తెలిపారు. రక్షాబంధన్ ద్వారా సమాజంలోని ప్రతి వ్యక్తి మరో వ్యక్తి పట్ల బాధ్యత కలిగి ఉండాలనే భావనను విద్యార్థుల్లో పెంపొందిస్తూ, "మనమంతా ఒక కుటుంబం -- మన దేశం మనందరి బాధ్యత" అనే భావాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజలను ఆకట్టుకోవడంతో పాటు రక్షాబంధన్‌ను కుటుంబ బంధం నుంచి సామాజిక బంధంగా విస్తరించే చక్కని సందేశాన్ని అందించింది. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం కరినగర్ జిల్లా ఉపాధ్యక్షులు పాక పావన కృష్ణ, పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, సభ్యులు కొత్తూరు ముకుందం, కరీనగర్ విభాగ్ ఉపాధ్యక్షులు కోట లక్ష్మారెడ్డి, ఆచార్య బృందం మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యుత్ ఉద్యమ అమరవీరులకు రెడ్ సెల్యూట్

- బషీర్‌బాగ్ అమరవీరుల సంస్మరణ సభలో సీపీఎం నేతల నివాళులు

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజాతీర్పు తాండూర్ మండలం రిపోర్టర్) ఆగస్టు 28**

విద్యుత్ ఉద్యమ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సీపీఎం తాండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులు బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం తాండూరు మండల కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ.. విద్యుత్ లేకుండా ఆధునిక జీవితం ఒక్క అడుగు కూడా ముందుకు సాగదని అన్నారు. నీటి సరఫరా, వ్యవసాయం, విద్య, వైద్యం, దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు సామాన్య ప్రజల జీవనం వరకు ప్రతి రంగానికి విద్యుత్తే ఆధారమన్నారు. అలాంటి విద్యుత్తు ప్రజల హక్కా? లేక కార్పొరేట్ల సొత్తా? అనే ప్రశ్న మరోసారి ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. 26 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బషీర్‌బాగ్‌లో ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారని గుర్తుచేశారు. ఆ ఉద్యమంపై జరిగిన పోలీసు కాల్పుల్లో బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి ప్రాణాలు కోల్పోయారని, వారి త్యాగం విద్యుత్ రంగాన్ని ప్రజల కోసం కాపాడుకునే పోరాటానికి చిరస్మరణీయ స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ప్రస్తుతం విద్యుత్ రంగంపై కార్పొరేట్ ఆధిపత్యం పెరుగుతున్న నేపథ్యంలో బషీర్‌బాగ్ అమరవీరుల త్యాగాలు మరోసారి ప్రజలకు దిశానిర్దేశం చేస్తున్నాయని అన్నారు. విద్యుత్తును ప్రజాసేవగా కాపాడుకునేందుకు విస్తృత ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న విద్యుత్ సవరణలపై రైతులు, కార్మికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని దాగం రాజారాం తెలిపారు. విద్యుత్ చార్జీలను మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పెంచే విధానాలు అమలులోకి వస్తే సామాన్య ప్రజలపై మరింత భారం పడే ప్రమాదం ఉందన్నారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల మాదిరిగా భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు కూడా తరచూ పెరిగే పరిస్థితి ఏర్పడవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రతిపాదనలను, విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధానాలను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. బషీర్‌బాగ్ ఉద్యమ స్ఫూర్తితో విద్యుత్ రంగ పరిరక్షణ కోసం మరో ప్రజా ఉద్యమానికి సిద్ధమవుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొమ్మకేత దుర్గం నాన్నయ్య, జైనేని రాజయ్య, కే. రాజయ్య, చింతపురి లక్ష్మణ్, ధర్మరాజుల వెంకటేశం, రవీందర్, కామెరా బాపు, షబీర్, లక్ష్మయ్య, ఉద్నాల చందు, చంద్రగిరి తిరుపతి, మాడిపెల్లి చందు, తమ్ముల వేణి శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# మై భారత్ ఆధ్వర్యంలో మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో "ఖేలో ఇండియా డైలాగ్ - ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్" కార్యక్రమం

**(వినోద్, ప్రజా తీర్పు మెడ్చల్--మల్కాజిగిరి) ఆగస్టు 28**

జాతీయ క్రీడా దినోత్సవం--2026 సందర్భంగా గురువారం మై భారత్, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని రెండు విద్యాసంస్థల్లో "ఖేలో ఇండియా డైలాగ్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్" ప్రత్యక్ష కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, యువత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, క్రీడా ప్రతిభను గుర్తించడం, ఫిట్‌నెస్, క్రమశిక్షణ మరియు దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలను ప్రధానమంత్రి సందేశం ప్రధానంగా ఉద్ఘాటించింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లిలో అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు జి. సాయి చరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. క్రీడల్లో రాణించేందుకు క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని యువతను ప్రేరేపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. నాగుల వేణు, డా. డి. పద్మ, డా. ఎ. గోపాల్ పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, మెడ్చల్లో జాతీయ స్థాయి సైక్లిస్ట్ అల్లాడి సాయి శ్రేయస్, కోచ్ అల్లాడి కృష్ణ, స్విమ్మర్లు విష్ణు వర్ధన్, వర్షిత్ ధులిపూడి, అభయ్ లక్కోజు, సచిన్ సాత్విక్, కశిష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి. రాధ, పి.వి. నాగలక్ష్మి (ఏ టీ పి ), ప్రతిభ (డి డబ్ల్యూ ), ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మిస్ ఇ. నాగలక్ష్మి పాల్గొన్నారు. కిరణ్‌కుమార్ కందుకూరి, ఎ. హర్షిత రెడ్డి, ఇ. వికాస్ మై భారత్ తరపున కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. క్రీడలు, ఫిట్‌నెస్, క్రమశిక్షణ మరియు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే ఆరోగ్యకరమైన జీవనశైలితో యువతను శక్తివంతం చేసి వికసిత భారత్ ఏ2047 లక్ష్య సాధనలో భాగస్వాములను చేయాలనే ప్రధానమంత్రి దృష్టికోణాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, స్వచ్ఛంద సేవ, నాయకత్వం, అనుభవాధారిత అభ్యాసం మరియు దేశ నిర్మాణానికి సంబంధించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2027లో చురుకుగా పాల్గొని తమ ఆలోచనలు, ప్రతిభ మరియు శక్తిని దేశ అభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు. మై భారత్, మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి స్నేహల్ ద్యానేశ్వర్ బసుట్కర్ యువత క్రీడలు మరియు ఫిట్‌నెస్‌ను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని మై భారత్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ వికసిత భారత్ నిర్మాణానికి తమ ఆలోచనలు, శక్తితో అర్థవంతమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు నిరంతరాయంగా త్రాగునీటిని అందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 28**





ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో అమృత్ 2.0 పథకం క్రింద కొనసాగుతున్న నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రతినిత్యం నిరంతరాయంగా త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ల పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, ఆసుపత్రిలోని పనులను పరిశీలించి వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అదనపు గదుల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించి వంట సిబ్బంది ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ లతో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, రీ సర్వే నిర్వహణ తీరును పరిశీలించారు. ఎస్ ఐ ఆర్ నోటీసుల జారీ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. భూముల రీ సర్వే లో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ, అటవీ భూములు, గ్రామాల హద్దుల నిర్ధారణ సమర్థవంతంగా చేపట్టాలని, రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ వేగవంతం చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ రాఘువేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి ఎస్ ఐ ఆర్, భూముల రీ సర్వే ప్రక్రియ నిర్వహణపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల జారీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, భూముల రీ సర్వే నిర్వహణలో అధికారులు నిబంధనలకు లోబడి విధులు నిర్వహించాలని, సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# 32వ డివిజన్‌లో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**కరీంనగర్, ఆగస్టు 28 (ప్రజాతీర్పు)**

32వ డివిజన్ హుస్సేనీపురాలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ షేక్ యూసుఫ్ పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ షేక్ యూసుఫ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు రేషన్‌తో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం రేషన్ కార్డును పొందేందుకు దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, రేషన్ డీలర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



# రక్షా బంధన్ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 28**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కార్మికుల మధ్య సోదరభావాన్ని చాటేలా అత్యంత వైభవంగా సాగిన రక్షా బంధన్‌బివేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి దావ స్వాతి-రమేష్ బాబు, ఈ సందర్బంగా మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, మరియు మున్సిపల్ సిబ్బంది, కార్మికులను సోదరులుగా భావించి మున్సిపల్ చైర్ పర్సన్ రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేసారు.. అనంతరం బ్రహ్మ కుమారీస్, బెల్లంపల్లి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఇంట్లో రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా బ్రహ్మ కుమారీస్ రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.. అనంతరం బెల్లంపల్లి మున్సిపాలిటీ 29వ వార్డ్ కౌన్సిలర్ పున్నం చంద్రు పుట్టినరోజు సందర్బంగా పాత బస్టాండ్ ఏరియాలో కేక్ కట్ చేయించి, ప్రజా సేవ చేస్తూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో తోటి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



# ఘనంగా యజుర్వేద ఉపాకర్మ వేడుకలు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 28 (ప్రజా తీర్పు)**

లక్ష్మీగణపతి బ్రాహ్మణ సంఘం చందానగర్ శాఖ ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమి తిథిని పురస్కరించుకుని యజుర్వేద ఉపాకర్మ వేడుకలను శుక్రవారం సీతారామాంజనేయ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఘనాపాటి హరి సీతారామమూర్తి నేతృత్వంలో వేద పండితుల బృందం ఈ ప్రక్రియను వేదోక్తంగా పూర్తి చేసి నూతన యజ్ఞోపవీత ధారణను గావించారు. ఈ సందర్భంగా వేదాలను అందించిన పూర్వపు ఋషులకు ,పితృదేవతలకు ఘనంగా తర్పణాలు సమర్పించారు. అనంతరం హోమంతో పాటు పూర్ణాతిని వేద మంత్రాల నడుమ పూర్తి చేసారు. తదుపరి ఘనాపాటిని ఘనంగా తాంబూలంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీగణపతి బ్రాహ్మణ సంఘం ప్రతినిధి శశిధర్ సహా ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



# రాఖీ పండుగ సందర్భంగా బాలసదనం పిల్లలకు ఆత్మీయ ఆతిథ్యం- కలెక్టర్ మను చౌదరి

**(వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ జిల్లా ప్రతినిధి) ఆగస్టు 28**

రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో ప్రభుత్వ బాలసదనం బాలబాలికలు జిల్లా కలెక్టర్ మనుచౌదరి కి రాఖీలు కట్టి రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి బాలసదనం పిల్లల కోసం ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేసి, వారికి స్వీట్లు మరియు కొత్త దుస్తులను అందజేశారు. పిల్లలతో కలిసి భోజనం చేస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి అవసరాలను తెలుసుకున్నారు. పిల్లల చదువు, ఆరోగ్యం మరియు సంక్షేమానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పిల్లల విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి శారద, బాలక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమలాదేవి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఇంతియాజ్ రహీం తదితర అధికారులు పాల్గొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు బాలసదనం పిల్లలు రాఖీలు కట్టడం, పిల్లలతో కలిసి భోజనం చేసి వారికి స్వీట్లు, కొత్త దుస్తులు అందించడం ద్వారా అధికారులు పిల్లలకు ఆప్యాయత, భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమం బాలసదనం పిల్లల్లో ఆనందాన్ని నింపింది.



# ముఖ్యమంత్రి కి రాఖీ కట్టిన అడువాల జ్యోతి...

( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 28.

రక్షాబంధన్ సందర్భంగా ముఖ్యమంత్రి కి చెల్లెలిగా రాఖీ కట్టిన జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ర క్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి చెల్లెలిగా రాఖీ కట్టి రక్షాబంధన్ శు భాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో కలిసి ఆనందంగా జరుపుకున్నారు. అంతకుముందు శ్రావణ మాసం మూడవ శుక్రవారం సందర్భంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో అడువాల జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, సౌభాగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సంతోషం నెలకొనాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు.



# సీఎం రేవంత్‌కు రాఖీ కట్టిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ

హైదరాబాద్, ఆగస్టు 28(ప్రజా తీర్పు)

రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి రాష్ట్ర మంత్రులు దనసరి సీతక్క, కొండా సురేఖ రాఖీ కట్టారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం ఉదయం ఈ వేడుక జరిగింది. మంత్రులు సీతక్క, కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి తిలకం దిద్ది రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి స్వీట్లు పంచుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రతి ఏడాది సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కడుతున్నానని తెలిపారు. ఈసారి ప్రత్యేకంగా బంగారు రాఖీని తయారు చేయించి సీఎంకు కట్టినట్లు చెప్పారు. పండుగ రోజు రాజకీయ అంశాలపై తాను మాట్లాడబోనని స్పష్టం చేశారు.



# జంధ్యాల(రాఖీ)పౌర్ణమిలో అన్న ప్రసాద ధాతకు సన్మానం

( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఆగస్టు 28:

జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని కిషన్ రావు పేట గ్రామ శ్రీ నాగ పెల్లి లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం జంధ్యాల(రాఖీ ) పౌర్ణమి పురస్కరించుకొని స్వామి వారి గిరిప్రదక్షిణ అత్యంత వైభవంగా నిర్వహించారు. గిరి ప్రదక్షణకు వచ్చిన భక్తులకు, రాఖీ పౌర్ణమి సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులందరికీ ఎండపల్లి మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, అఖిల భారత యాదవ మహాసభ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎలుక రాజు యాదవ్ - సుజాత దంపతులు భక్తులకు అన్న ప్రసాదం చేశారు. ఈ సందర్భంగా ఎలుక రాజు యాదవ్ -సుజాత దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ ఎండపల్లి వెల్గటూర్ మండల శాఖల అధ్యక్షులు అల్లే వెంకటేష్ యాదవ్, మాచర్ల రాజేందర్ యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ సమ్మెట బాపురాజు యాదవ్, సంకెనపల్లి సర్పంచ్ కొదురుపాక పూజిత- సతీష్, నాయకులు కుమ్మరి వెంకటేష్, జాడి రాజేశం, యాగండ్ల గంగయ్య యాదవ్ , మోకెనపల్లి బాపు, పూదరి రమేష్, రాయించు ప్రభాకర్, చింతకింది అనిల్, కోమటిపల్లి అఖిల్ పాల్గొన్నారు.

# పెద్దూరి శివాన్ష్ కు రాఖీ కట్టిన అక్కలు

## తమ్ముడు అక్కల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్ )ఆగస్టు 28



రాఖీ పండుగ సందర్భంగా తమ్ముడు అక్కల ఆత్మీయత రాఖీ పండుగ సందర్భంగా పెద్దూరి శివానిష్కి వారి అక్కలు.రాఖీ కట్టి తమ్ముడు అక్కల మధ్య ఉ న్న ప్రేమానురాగాలను చాటుకు న్నారు.ఈ సందర్భంగా సోదరీల ప్రేమతో కట్టిన రాఖీని ఆప్యాయంగా స్వీకరించిన పెద్దూరి శివాన్ష్ తమ్ముడు అక్కల అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే సంతోషం గా, ప్రేమతో కొనసాగాలని ఆకాంక్షించారు. తమ్ముడు అక్కల పవిత్ర బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపినారు .

# గాయత్రి హోమం మరియు యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

(వినోద్, మేడ్చల్ ప్రజాతీర్పు ప్రతినిధి) ఆగస్టు 28



రామంతపూర్ పద్మశాలి సంఘం, శ్రీ భక్త మార్కండేయ శివాలయం కమిటీ వారి ఆధ్వర్యంలో ఈరోజు మార్కండేయ భవన్ లో గాయత్రి హోమం మరియు యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వేద పండితులచే వేద మంత్రోచ్ఛారణల నడుమ గాయత్రి హోమం నిర్వహించి, భక్తులకు యజ్ఞోపవీత ధారణ గావించారు. పద్మశాలి కుల ఇలవేల్పు అయిన శ్రీ భక్త మార్కండేయ స్వామి ఆశీస్సులతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పద్మశాలి సంఘం పెద్దలు, మహిళా సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున హాజరై, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ.. పద్మశాలి సంఘం ఐక్యత కోసం, ధర్మ పరిరక్షణ కోసం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రామంతపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వరరావు, సీనియర్ అడ్వకేట్ మాచర్ల రంగయ్య, పాల్గొనడం జరిగింది, అలాగే సంఘం అధ్యక్షులు కొండ కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సిరిసాల విజయ ప్రకాష్, కోశాధికారి కొంగరి బాలచంద్రయ్య, సలహాదారులు పి.వి.రాం నర్సయ్య, గుండ్ల రవీంద్ర కుమార్, దేవాలయ కమిటీ చైర్మన్ జన్ను వెంకటయ్య, వైస్ చైర్మన్ వర్కాల పెంటయ్య, ఫౌండర్ సకినాల కృష్ణ, రాపోలు రాములు తిరందాసు వెంకటేష్, గుర్రం అంబయ్య, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వనం యాదగిరి, వైస్ చైర్మన్ రాపోలు రామచంద్రం, ఫౌండర్ చింతల సత్యనారాయణ, తిరందాసు శేషయ్య, చిక్క సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వర్కల స్వామి, ఏలే రమేష్, సంగిశెట్టి యాదగిరి, సహాయ కార్యదర్శి రాపోలుశేఖర్, సంయుక్త కార్యదర్శి గజ మురళి, సహాయ కోశాధికారి దునుకమురలీ కార్యనిర్వాహక సభ్యులు సంఘం వేణు మునగపాటి నరసింహ కార్యవర్గ సభ్యులు ఉలుగొండ నారాయణదాసు, పండాల నర్సింలు, గారిపల్లి లక్ష్మీనారాయణ, గంజి సురేష్, మిరియాల సందీప్, గంజి గణేష్, ఈడెం బాలు, బిక్షమయ్య, వీరేశం, గంజి వెంకటేష్, పాల్గొనడం జరిగింది,



# ములుగు 12వ వార్డు కౌన్సిలర్ పోరిక రాజు కుటుంబంలో రాఖీ సందడి

ములుగు ఆగస్టు 28(ప్రజా తీర్పు రిపోర్టర్ వెంకట్ )

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ పోరిక రాజు కుటుంబం లో రాఖీ వేడుకలు ఘనంగా, ఆత్మీయంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో రాఖీ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి వారి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలను ఆకాంక్షించారు. అన్నదమ్ములు తమ సోదరీమణులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పరస్పరం స్వీట్లు తినిపించుకుని రాఖీ పండుగ శు భాకాంక్షలు తెలియజేసుకున్నారు. కౌన్సిలర్ పోరిక రాజు మాట్లాడుతూ.. రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాఖీ వేడుకలతో పోరిక రాజు ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యుల ఆత్మీయత, ఆనందంతో వేడుకలు సందడిగా సాగాయి.

# నూతన వారాహి కిరాణా షాప్ ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపిన - రాణా ప్రతాప్ రెడ్డి

నర్సంపేట టౌన్ ఆగస్టు 28 రాజా తీర్పు ప్రతినిధి



భారతీయ జనతా పార్టీ దుగ్గొండి మండల ఉపాధ్యక్షులు సకినాల నరేష్ బల్వంతపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వారాహి కిరాణాలి షాప్ ని ప్రారంభించి ,శుభాకాంక్షలు తెలియజేసిన లిభారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా॥ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఈ కార్యక్రమంలో గ్రామా సర్పంచ్ షెంకేషి కమలాకర్,మాజీ సర్పంచ్ ఎర్ర ఆదిరెడ్డి,జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాలడుగుల జీవన్,మండల ప్రధాన కార్యదర్శి కతరబాజీ చిరంజీవి,బుట్టి రాజు,మాదం భాస్కర్,నరేష్ మరియు గ్రామా పెద్దలు తదితరులు పాల్గొన్నారు....



# శ్రావణ మాసం అమ్మవారికి... ఆడపడుచులకు ప్రత్యేక మాసం..

- అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు చల్లగా ఉండాలి...
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ..

సిద్దిపేట ఆగస్టు 28 (ప్రజా తీర్పు)

శ్రావణ మాసం రాఖి పౌర్ణమి శ్రీ సంతోషి మాత అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా సిద్దిపేట పట్టణం లోని శ్రీ సంతోషి మాత దేవాలయం లో అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు . ఈ సందర్బంగా మాట్లాడుతు ఆడపడుచులకు రాఖి పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.. శ్రీ సంతోషి మాత పుట్టినరోజున అమ్మవారి దర్శన భాగ్యం ఎంతో పుణ్యమని, అమ్మవారికి, ఆడపడుచులకు ఈ శ్రావణ మాసం ఎంతో పవిత్ర మైనది శ్రేష్ఠమైనదన్నారు.. అమ్మవారి ఆశీస్సులతో అన్నింటా ప్రజలందరికి మంచి జరగాలని, చల్లగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.. ఈ సందర్బంగా ఆలయం లో అర్చకులు, ఆలయ ఈ ఓ హరీష్ రావు కి అమ్మవారి ప్రసాదం అందజేసి ఆశీస్సులు ఇచ్చారు.. ఆలయం లో జరిగిన ఉద్యాపాన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఈనెల 31వరకు పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ

సిద్దిపేట ఆగస్టు 28 (ప్రజా తీర్పు)



చేయూత పథకం కింద కొత్త సామాజిక భద్రతా పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 31వ తేదీ చివరి తేదీ అని అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లా ప్రజలకు తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి శాఖ వారు జారీ చేసిన చేయూత సామాజిక భద్రత కొత్త పెన్షన్లు మంజూరు-2026 సంబంధించి గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత చేనేత కార్మికులు, రక్తసంబంధిత దివ్యాంగులు, ఫైలేరియా వ్యాధి ద్వారా బాధపడేవారికి చేయూత అందించడం కోసం కొత్త పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారిక వెబ్సైట్ లొ దరఖాస్తు స్వీకరణ గడువు చివరి తేదీ ఆగస్టు 31 ముగుస్తుందని తెలిపారు. ఆన్లైన్ లో అప్లై చేసుకున్న దరఖాస్తులను గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో , పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో ఇంచార్జీ డిఆర్డిఓ రమేష్, అడిషనల్ డిఆర్డిఏ సుధీర్ తదితరులు ఉన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- బాలికల రక్షణ, విద్య, సాధికారతకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి
  - కలెక్టర్ అంకిత్

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 28



భద్రాద్రి కొత్తగూడెం,రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు జిల్లా కలెక్టర్ గారితో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్), జిల్లా సంక్షేమాధికారి కి మరియు ఇతర అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు బాలికలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి విద్య, భవిష్యత్ లక్ష్యాలు, అభిరుచుల గురించి తెలుసుకున్నారు. బాలికలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ తదితర బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాలికలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి, దేశానికి విలువైన సంపద అని అన్నారు. ప్రతి బాలికకు సురక్షితమైన వాతావరణం కల్పించడంతో పాటు, నాణ్యమైన విద్యను అందించి, వారు తమ కలలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "బేటీ బచావో -- బేటీ పడావో" స్ఫూర్తితో బాలికల రక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. బాలికలు ధైర్యంగా ముందుకు సాగి, ఉన్నత విద్యను అభ్యసించి, తమకు నచ్చిన రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. "బాలికను కాపాడుదాం -- బాలికను చదివిద్దాం -- బాలిక ఎదుగుదలకు తోడ్పడదాం" అనే సందేశంతో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలికల భద్రత, విద్య, భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రక్షాబంధన్ సందర్భంగా చిల్డ్రన్ హోమ్ బాలికలు అధికారులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరి నుంచి తమకు అండగా ఉంటుందనే భరోసాను పొందారు. ఈ కార్యక్రమం బాలికల్లో ఆత్మవిశ్వాసం, భద్రతా భావం, కుటుంబ అనుబంధం పెంపొందించేలా ఆత్మీయ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమం లో హబ్ మిషన్ కోఆర్డినేటర్ సంతోష రూప , స్వాతి , ప్రియాంక , మౌనిక , దీప్తి , చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వినోద్ మరియు బాలికలు పాల్గొన్నారు

# ఆకట్టుకున్న 'సత్యశోధక' నాటిక





## జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 28**

టేకులపల్లి, సింగరేణి కాలనీ సి.ఇ.ఆర్. క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర, ఆశయాల ఆధారంగా రూపొందించిన 'సత్యశోధక' నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోయగూడెం పిఓ మాధవరావు, డీజీఎం పర్సనల్ అజ్మీర తుకారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవైసీపీవో మాధవరావు మాట్లాడుతూ.. సమాజంలో విద్య, సమానత్వం, మహిళా సాధికారత కోసం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని, వారి ఆశయాలను నేటి తరానికి తెలియజేయడంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. సత్యశోధక' నాటికలో పూలే దంపతులు సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలు, వివక్షకు వ్యతిరేకంగా చేసిన పోరాటం, మహిళలకు విద్య అందించేందుకు చేసిన కృషిని కళాకారులు తమ అద్భుతమైన నటన ద్వారా ప్రదర్శించారు. నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి సింగరేణి ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో హాజరై నాటికను ఆసక్తిగా తిలకించారు. డీజే పర్సనల్ అజ్మీర తుకారం మాట్లాడుతూ మరో రెండు రోజులు సామాజిక చైతన్య నాటక ప్రదర్శనలుసామాజిక చైతన్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న నాటకోత్సవాల్లో భాగంగా ఈ నెల 29వ తేదీన జీకే కాలనీ సి.ఇ.ఆర్. క్లబ్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆశయాల ఆధారంగా రూపొందించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటికను ప్రదర్శించనున్నారు. అదేవిధంగా ఈ నెల 30వ తేదీన ఇల్లందు కమ్యూనిటీ హాల్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర, సామాజిక సంస్కరణల కోసం వారు చేసిన కృషి, ఆశయాల ఆధారంగా రూపొందించిన 'సత్యశోధన' నాటికను ప్రదర్శించనున్నారు. ఈ రెండు నాటికలు సాయంత్రం 6:30 గంటల నుంచి 8:00 గంటల వరకు ప్రదర్శించబడనున్నాయి. అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సామాజిక చైతన్య నాటక ప్రదర్శనలను వీక్షించి, కార్యక్రమాలను విజయవంతం చేయాలని సింగరేణి యాజమాన్యం కోరుతోంది.




## హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అరెస్ట్

**కోరుట్ల, ఆగస్టు 28 (ప్రజాతీర్పు)**

కోరుట్ల పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో క్యాషియర్‌పై దాడి చేసి హత్యకు ప్రయత్నించిన కేసులో రౌడీషీటర్‌ను కోరుట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. 27.08.2026 రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో బింగి అలియాస్ బంగి నగేష్ (24) బార్‌లో బీర్ ఇవ్వాలని క్యాషియర్‌ను దుర్భాషలాడాడు. క్యాషియర్ ప్రశ్నించడంతో నిందితుడు తన చేతికి ఉన్న స్టీల్ కడియంతో అతని ముఖంపై దాడి చేసి గాయపరిచాడు. అనంతరం బీర్ బాటిల్‌తో తలపై కొట్టేందుకు ప్రయత్నించగా బాధితుడు తప్పించుకున్నాడు. ఈ ఘటనను ప్రత్యక్ష సాక్షులు గమనించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు బింగి నగేష్‌ను 28.08.2026న కోరుట్లలో అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి దాడికి ఉపయోగించిన స్టీల్ కడియాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. నిందితుడిపై గతంలో పలు క్రిమినల్ కేసులు ఉన్నందున కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో అతనిపై రౌడీషీట్ కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల హెచ్చరిక రౌడీషీటర్లు, నేరస్తులు, ప్రజలను బెదిరిస్తూ అక్రమాలకు పాల్పడే వ్యక్తులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని కోరుట్ల పోలీసులు హెచ్చరించారు

## పిర్యాదు చేసిన 24గంటల్లోనే దొంగను పట్టుకొని దొంగిలించన సొమ్ము రికవరీ చేసిన జగిత్యాల పోలీస్‌లు

- కానిస్టేబిల్స్ జీవన్. చంద్రశేఖర్ లను అభినందించిన పట్టణ ఇన్స్పెక్టర్ పి. కరుణాకర్

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) ఆగస్టు 28**



జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో తేదీ 26.8.2026రోజున ఫిర్యాదురాలు షబానా తబస్సుమ్ ఇస్లాంపూర్, జగిత్యాల నివాసురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 25.8.2026 రోజున అర్ధరాత్రి సమయంలో వారి ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి దొంగతనం చేసి నగదు మరియు బంగారు నగలు ఎత్తుకెళ్లినారు అని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కే. కుమారస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ఈరోజు 27.8.2026 రోజున కరీంనగర్ రోడ్డు జగిత్యాల లో మధ్యాహ్నం సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తినీ ఎస్ ఐ కుమారస్వామి తన సిబ్బందితో కలిసి పట్టుకుని పంచుల సమక్షంలో విచారించగా తన పేరు మొహమ్మద్ షోయబ్, తండ్రి ఎండి హబీబ్ ఖాన్,22 నివాసం ఇస్లాంపూర, జగిత్యాల అని చెప్పి తను చేసిన దొంగతనాన్ని ఒప్పుకొని తన వద్దనున్న నగదు 9000/మరియు 2.5 గ్రాముల బంగారు నగలు చూపించగా పంచుల సమక్షంలో వాటిని స్వాధీన పరుచుకొని సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి అట్టి వ్యక్తిని రిమాండ్కు తరలించనైనది అని పట్టణ ఇన్స్పెక్టర్ పీ కరుణాకర్ తెలియపరిచారు. అట్టి దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి దొంగను అతి తక్కువ సమయంలో పట్టుకున్న కానిస్టేబుల్ జీవన్, చంద్రశేఖర్ లను జగిత్యాల పట్టణ ఇన్స్పెక్టర్ పి. కరుణాకర్ అభినందించారు

## ముఖ్యమంత్రికి రాఖీ కట్టిన కుంజా కవిత

**హైదరాబాద్, ఆగస్టు 28 (ప్రజా తీర్పు)**

రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే కుంజా భిక్షం కుమార్తె కుంజా కవిత శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కుంజా కవిత రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రితో ఆత్మీయంగా పలకరించుకున్నారు.






## బీసీ నాయకుడు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ కు రాఖీ కట్టిన సోదరీమనులు









**నర్సంపేట టౌన్ ఆగస్టు 28 ప్రజా తీర్పు ప్రతినిధి**

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ కు బీసీ సోదరీమనులు నర్సంపేట పట్టణంలోని తన నివాసంలో రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ రాఖీ పండుగ సందర్భంగా నాకూ రాఖీ కట్టిన సోదరీమనులతో పాటు వరంగల్ జిల్లా మరియు నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు.



## తడకపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఏకగ్రీవము

**సిద్దిపేట ఆగస్టు 28 ప్రజా తీర్పు)**

సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ ఎను క్కోవడం జరిగింది. గ్రామ శాఖ అధ్యక్షులు గా శివ్వి కనకయ్య ఉప అధ్యక్షులు గా శ్రీనివాస్ గౌరవ అధ్యక్షులుగా శంకర్ గౌడ్ మైసని నగేష్ ఏనుకోవడం జరిగింది. ఎస్ సి సెల్ అధ్యక్షులు గుండి ప్రశాంత్ సురేష్ లుగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం అధ్యక్షులు శివ్వి కనకయ్య మాట్లాడుతూ. నాపై నమ్మకంతో నాకు ఈ యోక్కా బాధ్యతలు అప్పగించడం సంతోషం మరియు కొంత బాధాకరం ఎందుకూంటే ఏదిఏమైనా పార్టీ కొరకు నిరంతరం కష్ట పడి పని చేస్తా మరియు నాయొక్క గ్రామ ప్రజలకొరకు నిరంతరం కష్టపడి వారికీ కావాల్సిన పార్టీ నుండి ఏ లాంటి అవకాశాలు ఉన్న మనగ్రామానికి సరిపడా నిధులు తెస్తాను నియోజకవర్గం నాయకులతో మాట్లాడి మన గ్రామానికి నిధులు తెస్తాను. గ్రామంలో ఉన్న ప్రతి పార్టీ కార్యకర్త అన్ని విధాలా సహాయం కావాలి,అప్పుడే మండలి నాయకులతో మాట్లాడే అవకాశం ఉంటుంది, కనుక అర్బన్ మండలం లో మాన గ్రామం అభివృద్ధి లో ముందంజలో నిలబెడుతా అన్ని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్ని రాజు అశోక్ కనకయ్య మైసని బూమలింగం మరియు ఇతర పార్టీ నాయకులు పాలుగోన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పనుల్లో స్పీడు పెంచాలి

- ఏమైనా చిన్న చిన్న లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 28**



హుజుర్ నగర్ డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలి , ఏమైనా చిన్న చిన్న లోపాలు ఉన్నా వెంటనే రెక్టిఫై చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ఇండ్ల సముదాయాల్లో మిగిలిపోయిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హుజుర్ నగర్ రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీ ఇండ్లను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల మంత్రి ఆదేశాల మేరకు హౌసింగ్ యూనిట్లలోని ప్రతీ బ్లాక్‌ను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇండ్లలో ఉన్న చిన్న చిన్న లోపాలను గుర్తించి, ఆ లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇండ్లతో పాటు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇండ్ల సముదాయం ప్రాంగణంలో మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన పునాది పనులు, డైనింగ్ హాల్ నిర్మాణాలు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. వీటితో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణ పనులకు ప్రాధాన్యతనిచ్చి పూర్తి చేయిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహసిల్దార్ కవిత మున్సిపల్ అధికారులు, గుద్దేదారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మోకుదెబ్బ పట్టణ అధ్యక్షులుగా తాబేటీ శ్రీనివాస్ గౌడ్

**నర్సంపేట టౌన్ ఆగస్టు 28 ప్రజా తీర్పు**

గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ పట్టణ అధ్యక్షులుగా నర్సంపేట పట్టణానికి చెందిన తాబేటి శ్రీనివాస్ గౌడ్ ను నియమించి నట్లు స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ తెలిపారు. శుక్రవారం నర్సంపేట లో మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం లో గీత కార్మికుల హక్కుల రక్షణ కోసం గత కొన్నేళ్లుగా శ్రీనివాస్ గౌడ్ చేస్తున్న కృషి ని చూసి పట్టణ అధ్యక్షులు గా నియమించినట్లు రమేష్ గౌడ్ తెలిపారు. శ్రీనివాస్ గౌడ్ నియమకం ఐనా నాటి నుండి రెండేళ్లు ఈ పదవిలో ఉంటాడని రమేష్ గౌడ్ వివరించారు. యాభై ఏళ్ళు నిండిన అర్హులైన గీతకార్మి కులందరికి ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయాలన్నారు. గౌడ కులస్తులందరు ఆర్థికంగా,సామాజికంగా,రాజకీయంగా ఎదగాలనిరమేష్ గౌడ్ పిలుపు నిచ్చారు. తనను మోకుదెబ్బ పట్టణ అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ కు,తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షులు గొపగాని వెంకట్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి మద్దెల సాంబయ్య గౌడ్, సలహాదారులు సొల్టీ సారయ్య గౌడ్,మచ్చిక రాజు గౌడ్, గోడిశాల మల్లయ్య గౌడ్, నర్సంపేట పట్టణ గౌడ సంఘం అధ్యక్షులు కోల వెంకటేశ్వర్లు గౌడ్,ఊద్దుల శ్రీనివాస్ గౌడ్ లకు శ్రీనివాస్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ నివాసంలో రాఖీ కట్టిన మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతి

**(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్ ) ఆగస్టు28**



రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ గారి నివాసంలో ఆత్మీయ వాతావరణంలో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతి ఎమ్మెల్యే గారిని సోదర భావంతో కలిసి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ, రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో సోదరభావం, మానవతా విలువలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రతినిధిగా జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే గారు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా ఎమ్మెల్యే గారికి రాఖీ కట్టి, ఆయన ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మరింత సేవ చేసే శక్తి, అవకాశం కలగాలని జ్యోతి ఆకాంక్షించారు. ఎమ్మెల్యే గారు కూడా జ్యోతికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అన్నాచెల్లెళ్ల అనుబంధం ఎల్లప్పుడూ ఇలాగే ఆత్మీయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ బంధాలను గౌరవించడం, సమాజంలో పరస్పర సహకారం మరియు సోదరభావాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారురక్షాబంధన్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే నివాసంలో ఆత్మీయత, ఆనందం వెల్లివిరిసింది.



# లాభాల్లోకి సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి వచ్చాయి. వరుసగా రెండు రోజులుగా నష్టపోయిన సూచీలకు బ్లూచిప్ సంస్థల షేర్ల నుంచి లభించిన మద్దతుతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు లాభాల వైపు నడిపించాయి. ఒక దశలో 400 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 330.92 పాయింట్లు అందుకొని 77,264.51 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 84.80 పాయింట్లు అందుకొని 24,175.65 వద్ద స్థిరపడింది. 30 షేర్ల ఇండెక్స్ సూచీల్లో టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టైటాన్, ఎటర్నల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, ఐసీఐసీఐ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ షేర్లు మాత్రం నష్టపోయాయి.




# రికార్డుస్థాయికి ఫారెక్స్ రిజర్వులు 729 బిలియన్ డాలర్లకు..

ముంబై, ఆగస్టు 28: దేశీయ మారకం నిల్వలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఈ నెల 21తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 12.422 బిలియన్ డాలర్లు ఎగబాకి 729.328 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు రిజర్వుబ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లిడించింది. మారకం విల్వలు ఇంతటి గరిష్ఠ స్థాయికి చేరుకోవడం దేశీయ చరిత్రలో ఇదే తొలిసారని పేర్కొంది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 9.905 బిలియన్ డాలర్లు పెరిగిన విషయం తెలిసిందే. గతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారాంతానికి నమోదైన 728.494 బిలియన్ డాలర్లు ఇదే గరిష్ఠ స్థాయి. మళ్లీ ఇప్పుడు ఆరు నెలల తర్వాత గరిష్ఠ స్థాయికి చేరాయని పేర్కొంది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా రూపాయి విలువ గరిష్ఠ స్థాయిలో పతనం కావడంతో రిజర్వుబ్యాంక్ జోక్యం చేసుకోని డాలర్ల విక్రయించడంతో అడ్డుకట్ట పడింది. గత వారాంతానికిగాను విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 9.482 బిలియన్ డాలర్లు ఎగబాకి 591.333 బిలియన్ డాలర్లకు చేరుకోవడం వల్లనే రిజర్వులు రికార్డు స్థాయికి ఎగబాకాయని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. విదేశీ మారకపు నిల్వల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికేతర కరెన్సీల విలువ పెరుగడం లేదా తగ్గడం వల్ల కలిగే ప్రభావాలు కూడా విదేశీ నిల్వలపై ప్రభావం చూపనున్నాయి. అలాగే బంగారం రిజర్వులు 2.801 బిలియన్ డాలర్లు ఎగబాకి 114.218 బిలియన్ డాలర్లకు చేరుకోగా..స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 112 మిలియన్ డాలర్లు అధికమై 18.852 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఐఎంఎఫ్ వద్ద భారత రిజర్వులు 26 మిలియన్ డాలర్లు అధికమై 4.925 బిలియన్ డాలర్లకు చేరాయి.




# జాబ్ మార్కెట్‌లో ఏఐ పాగా.. నియామకాలను ప్రభావితం చేస్తున్న కృత్రిమ మేధస్సు

భారతీయ క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు మరింత వ్యూహాత్మకంగా, నైపుణ్య ఆధారితంగా తయారయ్యాయి. కృత్రిమ మేధస్సు (ఏఐ).. నియామకాల ప్రక్రియను అంతకంతకూ మార్చేస్తున్నది మరి. ఓవైపు నైపుణ్యాలపై దృష్టి పెడుతూనే.. మరోవైపు 86 శాతం సంస్థలు తమ ఉద్యోగ నియామకాల్లో ఏఐకి పెదపీట వేస్తున్నాయని గురువారం విడుదలైన డెలాయిట్ ఇండియా క్యాంపస్ వర్క్‌ఫోర్స్ ట్రెండ్స్-2026 నివేదిక తెలిపింది. ఆయా రంగాల్లోని 257 కంపెనీలు, 505 క్యాంపస్‌ల అభిప్రాయాలు, తీరుతెన్నుల ఆధారంగా ఈ రిపోర్టు తయారైంది.కొత్త ఉద్యోగాలు వెతకండి

కంపెనీ యాజమాన్యాలు క్యాంపస్ హైరింగ్ బడ్జెట్లను పెంచుతున్నాయని ఈ తాజా నివేదిక పేర్కొన్నది. ఫ్రెషర్స్‌తోపాటు కెరీర్ ప్రారంభ దశలో ఉన్న ఉద్యోగులను తీసుకొని, వారికి భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా తర్ఫీదు ఇచ్చేందుకు సంస్థలు 19 శాతం బడ్జెట్‌ను పెంచాయని వెల్లడించింది. ఇక నియామకాల్లోకి ఏజెంటిక్ ఏఐని లోతుగా తీసుకెళ్తున్న నిర్వాహకులు.. ఇంకోవైపు ప్రధానమైన డిజిటల్, విశ్లేషణాత్మక నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతుల కోసం నియామకాల్లో ఇంటర్న్‌షిప్‌ను కూడా బలోపేతం చేస్తున్నారని వివరించింది. ఈ మార్పులు.. సంప్రదాయ క్యాంపస్ హైరింగ్ విధానం నుంచి మరింత నిర్మాణాత్మక, నైపుణ్య ఆధారిత నియామకాల వైపునకు కంపెనీలు మారుతున్నాయన్న దానికి అద్దం పడుతున్నట్టు డెలాయిట్ ఇండియా తమ నివేదికలో అభిప్రాయపడింది.

### అంతా ఏఐతోనే..

నేడు అన్ని రంగాల్లో ఏఐ వినియోగం అంతకంతకూ పెరిగిపోతున్నది. ప్రస్తుతం ఏఐ ప్రవేశించని పని లేదంటే అతిశయోక్తి కాదు. ఉద్యోగులతో పోల్చితే ఏఐ వాడకం.. కంపెనీలకు లాభదాయకంగా మారుతున్నది మరి. ఒక్కసారి పెట్టుబడి పెడితే.. ఆ తర్వాత నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటం.. ఉత్పాదకత పెరుగడం, ముఖ్యంగా మానవ వనరుల ద్వారా ఎదుర్కొనే జీతభత్యాలు, పని గంటలు, సెలవులు, ఇతర ప్రయోజనాలు తదితరాలు లేకపోవడం వంటివి కంపెనీలను ఏఐ దిశగా నడిపిస్తున్నాయి. ఇప్పటికే ఐటీ, ఆటో, లైఫ్ సైన్సెస్, తయారీ, టెక్నాలజీ రంగాల్లో ఏఐ వినియోగం విపరీతంగా పెరిగినది తెలిసిందే. ఈ క్రమంలో ఆయా సంస్థ లు తమ ఉద్యోగ నియామకాలను తగ్గించుకోవడం, ఉన్న ఉద్యోగులను తొలగిస్తున్నదీ చూస్తూనే ఉన్నాం.నా× కోర్సులు నేర్చుకోండి.

# సూర్యాపేట లో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం


- హైదరాబాద్ వెళ్లకుండానే సమస్యల పరిష్కారం.. జిల్లా ప్రజలకు అందుబాటులోకి సేవలు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 28**

సూర్యాపేట లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రం ప్రజలకు మరింత సౌకర్యవంతంగా నమ్మకంతో నాణ్యమైన సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శుక్రవారం విద్యానగర్ డీమార్ట్ ఎదురుగా ఏర్పాటు చేసిన నూతన ఆధార్ సేవా కేంద్రం ను కలెక్టర్ ప్రారంభించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఆధార్ వివరాలను క్రమం తప్పకుండా నవీకరించుకోవాలని ఆయన సూచించారు.కొత్త ఆధార్ నమోదు పూర్తిగా ఉచితం. అలాగే, 5-7 సంవత్సరాల మరియు 15-17 సంవత్సరాల వయస్సు గల వారికి తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ ఉచితంగా అందించబడుతుంది. 7-15 సంవత్సరాల వయస్సు గల వారికి తప్పనిసరి బయోమెట్రిక్ నవీకరణ 30 సెప్టెంబర్ 2026 వరకు ఉచితంగా అందించబడుతుందని . ఇతర ఆధార్ సేవల కోసం, యు ఐ డి ఏ ఐ నిర్ధారించిన రుసుము మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని ప్రజలకు మరింత సౌకర్యం కల్పించేందుకు, ఈ కేంద్రంలో ఆదివారాల్లో కూడా ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ఉద్యోగులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు మరియు ఇతర ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో ఆధార్ సేవలను పొందలని. ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్ సౌకర్యం అందుబాటులో ఉందని . ప్రజలు తమకు అనుకూలమైన తేదీ మరియు సమయాన్ని ముందుగానే బుక్ చేసుకొని, నియమిత సమయంలో కేంద్రానికి వచ్చి ఆధార్ సేవలను సులభంగా పొందవచ్చు.ఈ కొత్తగా స్థాపించబడిన కేంద్రం, సూర్యాపేట నగరం మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధార్ సంబంధిత నివాసితుల సమస్యలను పరిష్కరించడంలో మరియు ఆధార్ నమోదు, నవీకరణ సేవలను మరింత సులభంగా అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యు ఐ డి ఏ ఐ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ నాయిని రంగనాధ్ రెడ్డి, ఇర్ట్స్ అసిస్టెంట్ మేనేజర్ పి. రత్నాకర్, బి ఎల్ ఎస్ ఆధార్ సేవా కేంద్రం రీజనల్ మేనేజర్ కె. శ్రీనివాస్ కుమార్, లాలు, ఆపరేషన్స్ మేనేజర్, జి .గఫార్ అహ్మద్, ఈ-జిల్లా మేనేజర్ ఆధార్ సెంటర్ టెక్నికల్ టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# జియో ఐపీవోకు సెబీ సై.. దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ

## రూ.37,700 కోట్ల నిధుల సమీకరణ?

భారతీయ స్టాక్ మార్కెట్ల చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ రాబోతున్నది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) డిజిటల్ సర్వీసెస్ విభాగం.. జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ప్రతిపాదనకు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు సమాచారం జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్‌కు అందింది. ఈ ఏడాది జూన్‌లో ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ కోసం సెబీకి జియో తమ డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసిన విషయం తెలిసిందే.

### ఇదీ సంగతి..

ఐపీవో ప్రక్రియలో సెబీ ఆమోదమే కీలకం. ఆ తర్వాత సెబీ నిబంధనలకు లోబడి పబ్లిక్ ఇష్యూ పనులను కంపెనీలు మొదలుపెట్టవచ్చు. కాగా, ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా 3.8 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.37,700 కోట్లు)ను జియో సమీకరించనున్నది. దీంతో ఇప్పుడు హ్యుందాయ్ పేరిట ఉన్న భారతీయ అతిపెద్ద ఐపీవో (3.3 బిలియన్ డాలర్లు) రికార్డు కనుమరుగుకానున్నది. నిజానికి నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఐపీవో రూ.30,000 కోట్లతో రాబోతున్నది. వచ్చే నెల ద్వితీయార్ధంలో ఉండొచ్చని అంచనా. కానీ ఇదికూడా జియో కంటే చిన్నదే. ఇదిలావుంటే డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) ప్రకారం.. జియో ప్లాట్‌ఫామ్స్ 27 కోట్లదాకా ఫ్రెష్ ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నది. ఇవి ఇష్యూ తర్వాత కంపెనీ మొత్తం ఈక్విటీ బేస్‌లో దాదాపు 2.9 శాతానికి సమానం. ఇక సంస్థ విలువను సుమారు 137 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. కాగా, సాధారణ కార్పొరేట్ అవసరాలకేగాక జియో ప్లాట్‌ఫామ్స్ మెటీరియల్ సబ్సిడరీ అయిన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్‌కు సంబంధించిన కొన్ని బకాయిలను పాక్షికంగాగానీ, పూర్తిస్థాయిలోగానీ చెల్లించేందుకు ఐపీవో నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ ఏడాది జూన్ ఆఖరునాటికి జియో ఇన్ఫోకామ్ సబ్‌స్క్రైబర్లు 53.3 కోట్లకుపైనే ఉన్నారు. చైనా మొబైల్ తర్వాత వినియోగదారుల ఆధారంగా ప్రపంచంలో ఇదే రెండో అతిపెద్ద సంస్థ కావడం విశేషం.

### ఫుల్ డిమాండ్?

జియో ఐపీవోకు ఇన్వెస్టర్ల నుంచి ముఖ్యంగా రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తుందన్న అంచనాలున్నాయి. దేశీయ టెలికాం మార్కెట్‌లో ఇప్పుడు జియోదే హవా అన్న సంగతి విదితమే. కన్సాలిడేషన్ మోడ్‌లో ఉన్న టెలికాం రంగంలో ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ మినహా ఉన్నవి మూడే ప్రైవేట్ రంగ కంపెనీలు. అందులో వొడాఫోన్ ఐడియా కంటే ఎయిర్‌టెల్‌తోనే జియోకు గట్టి పోటీ. ఇక 5జీ నెట్‌వర్క్ విస్తరణ, శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు సైతం దేశీయ టెలికాం కంపెనీలకు మదుపర్లలో డిమాండ్‌ను పెంచుతున్నాయి. ఈ క్రమంలో జియో పబ్లిక్ ఇష్యూ వైపే ఇప్పుడు మదుపర్ల చూపంతా ఉన్నదని చెప్పకతప్పదు.




# జియో కంటే ఎయిర్‌టెల్‌కు అధికం జూలైలో పెరిగిన మొబైల్ యూజర్లు

గత కొన్ని నెలలుగా మొబైల్ వినియోగదారులను ఆకట్టుకోవడంలో దూసుకుపోయిన జియోకు ఎయిర్‌టెల్ షాకిచ్చింది. జూలై నెలలో భారతీ ఎయిర్‌టెల్‌ను 26.8 లక్షల మంది మొబైల్ యూజర్లు జత కాగా, ఇదే నెలలో జియో నెట్‌వర్క్‌ను 24.4 లక్షల మంది ఎంచుకున్నారు. టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది అలాగే వొడాఫోన్ ఐడియా నెట్‌వర్క్‌ను 2.4 లక్షల మంది ఎంచుకోగా..బీఎస్ఎన్ఎల్ లోకి 1.68 లక్షల మంది చేరారు. మొత్తంగా చూస్తే గత నెలలో 55.38 లక్షల మంది వైర్‌లెస్ కస్టమర్లు జతవడంతో మొత్తం సంఖ్య 128.79 కోట్లకు చేరుకున్నారు. దీంట్లో భారతీ ఎయిర్‌టెల్ వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 48.94 కోట్లకు చేరుకోగా, జియో 50.60 కోట్లు, వొడాఫోన్ ఐడియి 19.90 కోట్లకు చేరారు. దీంతోపాటు 108.75 కోట్లుగా ఉన్న బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్లు గత నెల చివరినాటికి 109.44 కోట్లకు చేరారు.



# దిగొచ్చిన పుత్తడి రూ.3,300 తగ్గిన తులం ధర

బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. డాలర్ బలహీనపడటంతోపాటు ట్రేడర్లు ప్రాఫిట్ బుకింగ్‌ను మొగ్గుచూపడంతో దేశీయంగా పుత్తడి ధర భారీగా పడిపోయింది. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర శుక్రవారం ఏకంగా రూ.3,300 తగ్గి రూ.1.62 లక్షలకు పడిపోయింది. వరుసగా ధరలు తగ్గడం ఇది మూడోరోజు కావడం విశేషం. గత మూడు సెషన్లలో గోల్డ్ ఏకంగా రూ.4,700 లేదా 3 శాతం తగ్గినట్టు అయింది. ఈ నెల 25న గోల్డ్ ధర రూ.1,67,100గా ఉన్న విషయం తెలిసిందే.

# అంతర్జాతీయ వ్యాపారంపై గురి ఆసియా, ఐరోపా దేశాల్లో ఎయిర్‌పోర్టుల అభివృద్ధి దిశగా..

## జీఎమ్మార్ గ్రూప్ చైర్మన్ జీఎం రావు

**అంతర్జాతీయ వ్యాపారంపై గురి భారతీయ బహుళజాతి మౌలిక రంగ దిగ్గజం జీఎమ్మార్ గ్రూప్ అంతర్జాతీయంగా ఉన్న మరిన్ని అవకాశాలపై దృష్టి పెడుతున్నది. పశ్చిమ, సెంట్రల్, ఆగ్నేయాసియా దేశాలతోపాటు తూర్పు ఐరోపా దేశాల్లో విమానాశ్రయాలు, వాటి అనుబంధ వ్యాపారాల్లోగల ప్రధాన అవకాశాలను అన్వేషిస్తున్నట్టు జీఎమ్మార్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ గ్రంధి మల్లికార్జున రావు తెలిపారు. ఎయిర్‌పోర్టులు, ఎనర్జీ, రహదారులు, పట్టణ మౌలికాభివృద్ధి రంగాల్లో జీఎమ్మార్ గ్రూప్ సేవలందిస్తున్న విషయం తెలిసిందే.**




భారతీయ బహుళజాతి మౌలిక రంగ దిగ్గజం జీఎమ్మార్ గ్రూప్ అంతర్జాతీయంగా ఉన్న మరిన్ని అవకాశాలపై దృష్టి పెడుతున్నది. పశ్చిమ, సెంట్రల్, ఆగ్నేయాసియా దేశాలతోపాటు తూర్పు ఐరోపా దేశాల్లో విమానాశ్రయాలు, వాటి అనుబంధ వ్యాపారాల్లోగల ప్రధాన అవకాశాలను అన్వేషిస్తున్నట్టు జీఎమ్మార్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ గ్రంధి మల్లికార్జున రావు తెలిపారు. ఎయిర్‌పోర్టులు, ఎనర్జీ, రహదారులు, పట్టణ మౌలికాభివృద్ధి రంగాల్లో జీఎమ్మార్ గ్రూప్ సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఢిల్లీ, హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 6 విమానాశ్రయాలను జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ నిర్వహిస్తున్నది. దీనికి ఇండోనేషియాలోనూ ఓ ఎయిర్‌పోర్టుండగా.. గ్రీస్‌లో మరో ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తున్నది. ఇక ఈ నెల 17న ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం ఎయిర్‌పోర్టులో కార్యకలాపాలనూ ఆరంభించింది. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను తాజాగా విడుదలైన వార్షిక నివేదికలో జీఎం రావు తన సందేశాన్నిచ్చారు. ప్రభుత్వ ప్రగతిదాయక నిర్ణయాలు, మెరుగవుతున్న విమానయాన మౌలిక సదుపాయాలు, విస్తరిస్తున్న పర్యాటక రంగం, పెరుగుతున్న ప్రజల ఆదాయాలతో భారతీయ విమానయాన దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపట్ల విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి తమ ఎయిర్‌పోర్ట్ ప్లాట్‌ఫామ్ పోర్ట్‌ఫోలియోను డ్యూటీ ఫ్రీ, కార్గో, రిటైల్, ఫుడ్, బేవరేజ్ వంటి ఎయిర్‌పోర్ట్ అనుబంధ వ్యాపారాల్లోకి విస్తరిస్తున్నామని చెప్పారు. కాగా, 2025-26లో జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ దేశీయంగా 11.46 కోట్ల ప్రయాణికులకు సేవలందించింది.

# టెంట్‌లో డ్రెస్సింగ్ రూమ్, ఆమడ దూరంలో వాష్‌రూమ్.. ఆసియా క్రీడలకు ‘బీ’ టీమ్‌ను పంపిస్తారా..!




ఆసియా క్రీడల ఆరంభానికి ముందే మౌలిక వసతులపై దుమారం రేగుతోంది. జపాన్‌లోని ఐచీ– నగోయాలో మెగా ఈవెంట్‌కు మరో 23 రోజులే ఉండగా.. క్రికెటర్లకు బస, వసతి ఏర్పాటుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఆటగాళ్ల సౌకర్యార్థం నిర్వాహకులు మెరుగైన చర్యలు తీసుకోకపోవడంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (దీజజ×) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. టెంట్‌లోనే డ్రెస్సింగ్ రూమ్, 500 మీటర్ల దూరంలో వాష్‌రూమ్.. వంటివి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడుతోంది బీసీసీఐ. టోర్నీ ఆరంభం కల్లా పరిస్థితిలో మార్పు లేకుంటే బీ టీమ్‌ను పంపాలనే ఆలోచనతో ఉంది బీసీసీఐ. సెప్టెంబర్ 19వ తేదీ నుంచి జపాన్ వేదికగా ఆసియా క్రీడలు మొదలవ్వనున్నాయి. టోర్నీకి సమయం దగ్గరపడినా ఐచీ నగోయ నగరంలో క్రికెటర్లకు వసతుల కల్పన అధ్వాన్నంగా ఉంది. వరల్డ్‌క్లాస్ క్రికెటర్లు పాల్గొననున్న ఈ క్రీడల్లో వారి సౌకర్యార్థం మెరుగైన ఏర్పాట్లు చేయకపోవడంపై బీసీసీఐ కోపంతో ఊగిపోతోంది. ఆసియా క్రికెట్ మండలి సైతం ఐచీ -- నగోయలో బస, వసతి ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశాయి. ‘జపాన్‌లో ఆసియా క్రీడల ఏర్పాట్ల పట్ల ఏసీసీ, బీసీసీఐ సంతృప్తిగా లేవు. అందుకని పరిశీలకులను జపాన్ పంపిస్తాం. వారు అక్కడి పరిస్థితులపై మాకు నివేదిక ఇస్తారు. టెంట్లలో డ్రెస్సింగ్ రూమ్ ఏర్పాటు చేశారని, వాష్‌రూమ్‌లు 500 మీటర్ల దూరంలో ఉన్నాయి. దాంతో, క్రికెటర్లు అసౌకర్యానికి గురవుతారనే విషయాన్ని ఏసీసీ సమావేశంలో జపాన్ ఒలింపిక్ అధికారుల దృష్టికి తీసుకొచ్చాం. అంతేకాదు హోటల్ గదులు కూడా చిన్నగా ఉన్నాయి’ అని బీసీసీఐ వర్గాలు ఏఎన్ఐతో పేర్కొన్నాయి. టోర్నీలో క్రికెట్ మ్యాచ్‌ల ఆరంభానికల్లా వసతులు మెరుగవ్వకుంటే.. పురుషుల, మహిళల విభాగంలో ఎంపిక చేసిన బృందం స్థానంలో బీ టీమ్‌ను పంపించాలని భారత బోర్డు భావిస్తోంది. చైనాలోని హంగ్జూలో స్వర్ణంతో మెరిసిన భారత జట్లు.. ఈసారి కూడా పసిడితో తిరిగిరావాలనే పట్టుదలతో ఉన్నాయి. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకూ పురుషుల క్రికెట్ మ్యాచ్‌లు.. సెప్టెంబర్ 17 నుంచి 22వ తేదీవరకూ మహిళల మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. భారత పురుషుల స్క్వాడ్ -- శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శివం దూబే, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, నితీశ్ రెడ్డి, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రానా, అర్ష్‌దీప్, బుమ్రా. భారత మహిళల స్క్వాడ్ -- హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్) స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, దీప్తి శర్మ, ప్రతీకా రావల్, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలిని(వికెట్ కీపర్), భారతి ఫుల్‌మాలి, శ్రీచరణి, రేణుకా సింగ్, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, రాధా యాదవ్, నందిని శర్మ.

# పాక్ 110 ఆలౌట్




లండన్: ఇంగ్లండ్ పర్యటనలో తొలి టెస్టును చిత్తుగా ఓడిన పాకిస్థాన్.. రెండో టెస్టులోనూ అదే వైఫల్యాన్ని కొనసాగిస్తున్నది. లార్డ్స్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును 290 పరుగులకే ఆలౌట్ చేశామన్న ఆనందంలో బ్యాటింగ్‌కు వచ్చిన పాక్.. ఇంగ్లిష్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకే ఆలౌట్ అయింది. 37.2 ఓవర్లే ఆడిన బాబర్ సేన.. ఒలి రాబిన్సన్ (4/11), జోఫ్రా ఆర్చర్ (3/26), జోష్ టాంగ్ (2/27) ధాటికి విలవిల్లాడింది. అజన్ (46), షకీల్ (16) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన బ్రూక్ సేన.. బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో కడపటి వార్తలందేసరికి 22 ఓవర్లకు 81/3తో మ్యాచ్‌ను శాసించే స్థితిలో నిలిచింది.




# భారత్‌కు 8వ స్థానం

హాకీ ప్రపంచకప్‌లో సెమీస్ చేరడంలో విఫలమైన భారత హాకీ జట్టు వర్గీకరణ మ్యాచ్‌లో పోరాడి ఓడింది. ఏడో స్థానం కోసం జరిగిన పోరులో భారత్.. బెల్జియం చేతిలో ఓడి 8వ స్థానంతో టోర్నీని ముగించింది. పెనాల్టీ షూటౌట్ ద్వారా ఫలితం తేలిన మ్యాచ్‌లో భారత్.. 3–4 (3–3)తో బెల్జియంకు తలొంచింది. తొలి క్వార్టర్ ఆరో నిమిషంలోనే అభిషేక్ గోల్ బోణీ కొట్టినా రెండో క్వార్టర్‌లో బెల్జియం తరఫున రొమెన్ డువెకొట్ (22వ నిమిషంలో), ఆ మరుసటి నిమిషమే హ్యూగో లబోచెరె గోల్‌తో బెల్జియం 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ రెండో అర్ధం ఆరంభమయ్యాకే హర్మన్‌ప్రీత్ గోల్‌తో స్కోర్లు సమమయ్యాయి. అయితే నాలుగో క్వార్టర్‌లో మొదలయ్యాక నికోలస్ గోల్ కొట్టాడు. ఆట మరో 30 సెకన్లలో ముగుస్తుందనగా భారత్‌కు దొరికిన పెనాల్టీని హర్మన్‌ప్రీత్ గోల్‌గా మలిచి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. షూటౌట్‌లో భారత్.. 3 గోల్స్ చేయగా బెల్జియం నాలుగు గోల్స్ కొట్టింది.

# డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు నీరజ్




భారత గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా వచ్చే నెల 5న బ్రసెల్స్ (బెల్జియం)లో జరుగనున్న డైమండ్ లీగ్ (డీఎల్) ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. ఈ సీజన్‌లో రెండు డీఎల్ (దోహా, లుసానె)లో మాత్రమే పాల్గొన్న నీరజ్.. పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు వచ్చాడు. దోహాలో నాలుగో స్థానంతో 7 పాయింట్లు సాధించిన అతడు.. లుసానెలో రెండో స్థానంతో ఐదు పాయింట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. గత గురువారం జురిచ్ వేదికగా ముగిసిన ఆఖరి డీఎల్ పోటీల్లో నీరజ్ పాల్గొనకపోయినా ఆ ఫలితాల అనంతరం వెల్లడించిన పాయింట్ల పట్టికతో తుదిపోరులో అతడు తన స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. శ్రీలంక అథ్లెట్ పతిరగె (39 పాయింట్లు) అగ్రస్థానంతో ఫైనల్స్‌కు అర్హత సాధించగా పీటర్సన్ అండర్సన్, కెశ్రాన్, థాంప్సన్, జులియస్ క్వాలిఫైడ్ లిస్ట్‌లో ఉన్నారు.

## మహిళల క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్‌ను ఎలా అనుమతిస్తారు?. ఆస్ట్రేలియాపై కాప్ ఆగ్రహం..!



లింగమార్పిడి చేసుకొని అమ్మాయిగా మారిన అనయా బంగర్(‌ూఅఖుఖు దీుఅస్త్రుఖతీ) పునరామనానికి ముందే విమర్శలు ఎదుర్కొంటోంది. ఆమెను మహిళల బిగ్‌బాష్ లీగ్(ఔదీదీూ)లో ఆడేందుకు అనుమతించడంపై మరిజానే కాప్ (వీఖతీఱఓఖఅఅవ ఖుజూజూ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ట్రాన్స్‌జెండర్ అయిన అనయను మహిళల క్రికెట్‌లో అనుమతించడం సమంజసం కాదని ఆమె క్రికెట్ ఆస్ట్రేలియాపై మండిపడింది. ట్రాన్స్‌జెండర్ అథ్లెట్లకు మహిళల క్రికెట్‌లో అవకాశం లేదని దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ స్పష్టం చేసింది. అబ్బాయిగా పుట్టి జూనియర్ స్థాయిలో క్రికెట్‌లో ఆడి.. ఇటీవలే లింగమార్పిడితో అమ్మాయిగా మారిన అనయా బంగర్‌కు చిక్కులు మొదలయ్యాయి. మహిళల క్రికెట్‌లో ఆడేందుకు సిద్ధమవుతున్న ఆమెపై విమర్శలు గుప్పించింది దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మరిజానే కప్. ట్రాన్స్‌జెండర్ అయిన అనయను మహిళల క్రికెట్‌లో అనుమతించిన క్రికెట్ ఆస్ట్రేలియాపై కాప్ తీవ్ర అగ్రహం వ్యక్తం చేసింది.




శర్వానంద్ తాజా చిత్రం ‘భోగి’ నిర్మాణ దశలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. 1960 ఉత్తర తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు నేపథ్య కథాంశంతో దర్శకుడు సంపత్‌నంది ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. శనివారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ‘గంగ ఒక్కడే..ప్రాణాలు ఐదు’ అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన ఈ పోస్టర్ పల్లెటూరి వాతావరణానికి, కుటుంబ బంధాలకు అద్దం పడుతున్నది. ఈ సినిమాలో శర్వానంద్ గంగ అనే పల్లెటూరి యువకుడి పాత్రలో కనిపించనున్నారు. స్పెషల్ పోస్టర్‌లో హీరో గంగ..తన తోబుట్టువులకు తాటి ముంజలు అందిస్తున్నారు. బలమైన కుటుంబ భావోద్వేగాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని పోస్టర్‌ని బట్టి అర్థమవుతున్నది. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాత: కె.కె.రాధామోహన్, రచన–దర్శకత్వం: సంపత్‌నంది.

# దేవ కన్యలా మెరిసిపోతున్న రాశీ



# ప్రతీ విషయంలో వివక్షే!



కథానాయిక తాప్సీకి వివాదాలు కొత్తేమి కాదు. ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన అభిప్రాయాల్ని వ్యక్తం చేయడం ఈ భామ నైజం. తాజాగా ఇండస్ట్రీలో కథానాయికలపై చూపించే వివక్ష గురించి తాప్సీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా కెరీర్ ఆరంభంలో తనకు ఎదురైన ఓ అనుభవాన్ని పంచుకుంది. ‘షూటింగ్ టైంలో హీరోయిన్స్ కొన్ని గంటల ముందే సెట్స్‌కి రావాల్సి ఉంటుంది. ఆ తర్వాతే హీరోలు వస్తారు. మాకు సమకూర్చే వసతులు కూడా అంతంత మాత్రమే ఉంటాయి. కెరీర్ ఆరంభంలో ఓ సినిమాలో నాపై భారీ స్థాయిలో ఓ ఇంట్రడక్షన్ సీన్ తీశారు. కానీ తర్వాత ఆ సన్నివేశాన్ని మొత్తం తొలగించారు. దర్శకుడిని ఆరా తీస్తే.. హీరో చెప్పడం వల్లే ఆ సీన్‌ను తీసివేశారని తెలిసింది.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020